ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

అన్నమయ్య
జిల్లా వార్తలు

శనివారం 1 నవంబరు 2025

జగనన్న మార్ట్‌కు వసూళ్లు

- 1344 డ్వాక్రా సంఘాల నుంచి రూ.20.16 లక్షల సేకరణ
- ఏడాది తర్వాత రూ.6.72 లక్షలు తిరిగి చెల్లింపు
- రూ.13లక్షలపై విచారణ కమిటీలు
- తేలని వ్యవహారం

7

దేశ సమైక్యతకు ప్రతిఒక్కరూ కృషి చేయాలి

- కలెక్టర్ నిశాంత్‌కుమార్, ఎస్పీ ధీరజ్ కునుబిల్లి
- ఉత్సాహంగా రాష్ట్రీయ ఏక్తా దివస్ ఐక్యతా పరుగు



సమైక్యత పరుగులో కలెక్టర్, జేసీ, ఎస్పీ, అదనపు ఎస్పీ, తదితరులు

రాయచోటిటౌన్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): దేశ సమైక్యతకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ నిశాంత్‌కుమార్, ఎస్పీ ధీరజ్ కునుబిల్లి అన్నారు. తొలి ఉప ప్రధానమంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురష్కరించుకుని జిల్లా కేంద్రమైన రాయచోటిలో శుక్రవారం రాష్ట్రీయ ఏక్తా దివస్ (జాతీయ సమైక్యతా దినం) వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్, ఎస్పీలు కలిసి జెండా ఊపి ఐక్యతా పరుగును ప్రారంభించారు. దేశ సమైక్యతా సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే లక్ష్యంతో చేసిన ఈ కార్యక్రమంలో సుమారు 300 మంది విద్యార్థులు, అధికారులు, సిబ్బంది రాయచోటి పట్టణంలోని చెక్‌పోస్టు శివాలయం నుంచి నేతాజీ కూడలి వరకు పరుగులో ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ భారతదేశ ఉక్కు మనిషి, జాతి సమైక్యతకు పాటుపడిన తొలి ఉప ప్రధానమంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ అని కొనియాడారు. దేశ ఐక్యతకు ఆయన చేసిన నిస్వార్థ సేవ, అంకితభావాన్ని స్మరించుకున్నారు. ఆయన జీవితం, ఆశయాలు మన జాతీయ సమగ్రతకు ఎల్లప్పుడూ స్ఫూర్తిగా నిలవాలన్నారు. అనంతరం యూనిటీ రన్ ముగింపులో జిల్లా అదనపు ఎస్పీ వెంకటాద్రి, అధికారులు, సిబ్బంది, విద్యార్థులు, ప్రజలు అందరిచేత దేశ సమైఖ్యత, భద్రతను కాంక్షిస్తూ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం విజేతలుగా నిలిచిన విద్యార్థులకు కలెక్టర్, ఎస్పీలు బహుమతులు అందజేసి భవిష్యత్తులో దేశం కోసం పాటుపడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, జిల్లా అదనపు ఎస్పీ వెంకటాద్రి, ఆర్డీవో శ్రీనివాసులు, మున్సిపల్ కమిషర్ రవికుమార్, ఏఆర్ డీఎస్పీ ఎం.శ్రీనివాసులు, తహసీల్దార్ నరసింహకుమార్, రెవెన్యూ, పోలీసు అధికారులు, సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

ముగ్గురు గంజాయి నిందితుల అరెస్ట్

- 21 కేజీల గంజాయి, రెండు మోటారుసైకిళ్లు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం
- మీడియా సమావేశంలో ఎస్పీ ధీరజ్ కునుబిల్లి



పట్టుబడ్డ గంజాయి, నిందితులతో ఎస్పీ, తదితరులు

రాయచోటిటౌన్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మదనపల్లె తాలూకా పోలీస్‌స్టేషన్ పరిధిలో గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్న ప్రధాన నిందితుడు జాఫర్‌అలీతో పాటు మరో ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో మీడియా సమావేశంలో ఎస్పీ ధీరజ్ కునుబిల్లి వివరాలు వెల్లడించారు. తమకు అందిన సమాచారం మేరకు పోలీసులతో నిఘా ఉంచామని, ఇందులో భాగంగానే గంజాయి అక్రమ రవాణా కేసులో జాఫర్‌అలీతో పాటు మరో ముగ్గురు భాగస్వామి కాగా నాల్గవ వ్యక్తి పోలీసుల కన్ను గప్పి పారిపోయాడన్నారు. నిందితుల నుంచి రూ.6.30 లక్షల విలువైన 21 కేజీల 815 గ్రాముల గంజాయితో పాటు రూ.2 లక్షలు విలువైన రెండు మోటారు సైకిళ్లు, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పట్టుబడిన నిందితులు ఓ ముఖ్య వ్యక్తి వద్ద గంజాయి కొనుగోలు చేసి మదనపల్లె పరిసర ప్రాంతాల్లోని కొందరు వ్యక్తులకు అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు విచారణలో తేలిందన్నారు. ఈ కేసులో మిగిలిన నిందితులను త్వరలోనే అరెస్టు చేస్తామని ఎస్పీ తెలిపారు. అన్నమయ్య జిల్లాను గంజాయి రహిత జిల్లాగా మార్చే లక్ష్యంతో గత వారం రోజులుగా మదనపల్లి సబ్ డివిజన్ పరిధిలో పోలీసులు విస్తృత ఆపరేషన్ నిర్వహించారన్నారు. ఇందులో భాగంగానే మదనపల్లె టూటౌన్, వన్‌టౌన్, పీటీఎం పోలీస్‌స్టేషన్ల పరిధిలో గంజాయి విక్రయిస్తున్న మరో ఏడుగురు నిందితులను అరెస్టు చేశామన్నారు. గడిచిన వారం రోజుల్లో మొత్తం 10 మంది నిందితులను అరెస్టు చేసి వారి నుంచి రూ.8 లక్షల 10 వేలు విలువైన 27 కిలోల 815 గ్రాముల గంజాయితో పాటు రూ.4 లక్షల విలువైన 5 మోటారు సైకిళ్లు, 9 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. అరెస్టు చేసిన 10 మందిలో ఒకరు అంతర్రాష్ట్ర సరఫరాదారుడు కాగా మరో ముగ్గురు ప్రధాన ముఠా నాయకులు (కింగ్‌పిన్లు), ఆరుగురు చిల్లర విక్రేతలు (పెడ్లర్లు) ఉన్నారన్నారు. అలాగే గంజాయి అలవాటు చేసుకున్న 20 మంది విద్యార్థులు, యువకులను సత్ప్రవర్తన కోసం చిత్తూరులోని పునరావాస కేంద్రం (రిహాబిలిటేషన్ సెంటర్)కు తరలించామన్నారు. అలాగే నిందితులను అరెస్టు చేయడంలో కీలక పాత్ర పోషించిన మదనపల్లె డీఎస్పీ మహేంద్ర, తాలూకా సీఐ కళా వెంకట్రమణ, ఎస్ఐలు అన్సర్, రహీం, దిలీప్, పోలీసు సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

అమరవీరులను స్మరించుకుందాం
* వివరాలు.. 6లో *

విపత్తులను ఎదుర్కోవాలి

రాయచోటిటౌన్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): విపత్తులను ఎదుర్కొనేందుకు, నాయకులుగా ఎదిగేందుకు స్కౌట్ మాస్టర్లకు, గైడ్ కెప్టెన్లకు శిక్షణ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని డీఈవో సుబ్రహ్మణ్యం అన్నారు. రాయచోటి పట్టణం డైట్ కేంద్రంలో ఈ నెల 25 నుంచి 31 వరకు 7 రోజుల పాటు నిర్వహించిన శిక్షణ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. డీఈవో మాట్లాడుతూ విద్యార్థుల్లో చిన్ననాటి నుంచే క్రమశిక్షణతో పాటు దేశభక్తి, సామాజిక సేవా భావాలను పెంపొందించేందుకు స్కౌట్ అండ్ గైడ్స్ చేస్తున్న కృషి ఎనలేనిదన్నారు. జిల్లా కార్యదర్శి నరసింహారెడ్డి, స్కూల్ జిల్లా కోఆర్డినేటర్ శ్రీనివాసరాజు, అర్చన విద్యాసంస్థల డైరెక్టర్ మదన్‌మోహన్‌రెడ్డి, ఎల్‌వోసీలు జయరాం, శివప్రసాద్, వెంకటేశ్వర్లు, శకుంతల తదితరులు పాల్గొన్నారు.



బాలికల కథ సుఖాంతం

- నెల్లూరు జిల్లాలోని కుసుమూరు దర్గా వద్ద అదుపులోకి
- ఆర్థిక ఇబ్బందులతోనే ఇంటి నుంచి వెళ్లిపోయినట్లు నిర్ధారణ



గాలివీడు పోలీస్‌స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడుతున్న సీఐ కొండారెడ్డి

గాలివీడు, అక్టోబరు 31(ఆంధ్ర జ్యోతి): అరవీడు గ్రామానికి చెందిన జాస్మిన్, జుబేదా అనే ఇద్దరు బాలికలు అదృశ్యమైన ఘటన కేసు సుఖాంతమైంది. ఈ కేసును అత్యంత ప్రతిష్టాత్మ కంగా తీసుకున్న ఎస్పీ, పోలీసులు 24 గంటలు గడవక ముందే ఛేదించారు. శుక్రవారం గాలివీ డు పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో సీఐ కొండారెడ్డి వివరాలు వెల్లడించా రు. ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఆదేశాల మేరకు 12 బృందాలతో గాలింపు చర్యలు చేపట్టిన పోలీసులు, సీసీ ఫుటేజీల ఆధారంగా సాంకే తిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియో గించుకుని నెల్లూరు జిల్లాలోని కుసుమూరు దర్గా వద్ద ఉన్నట్లు గురువారం అర్ధరాత్రి బాలికలను గుర్తించినట్లు తెలిపారు. ఈ విషయాన్ని వెంటనే అక్కడ ఉన్న వెంకటాచలం సత్రం పోలీసులకు సమాచారం అందించి ఆ సమయంలో వారి సహకారంతో బాలికలను అదుపులోకి తీసుకొని స్థానిక స్టేషన్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. అనంత రం స్థానిక ఎస్ఐ రామకృష్ణ తన సిబ్బంది నెల్లూరు జిల్లాలోని వెంకటాచలం సత్రం పోలీస్‌స్టేషన్‌కు చేరుకొని అక్కడి నుంచి బాలికలను తీసుకొచ్చి గాలివీడు తహసీల్దార్ ముందుకు హాజరు పరిచి స్టేట్మెంట్‌ను రికార్డ్ చేశామన్నారు. ఈ విచారణలో ఆర్థిక ఇబ్బందుల కారణంగా కుటుంబానికి భారం కాకూడదని, ఏదైనా ఉద్యోగం చేసుకోవాలనే ఉద్దేశ్యంతోనే ఇంటి నుంచి వెళ్లిపోయినట్లు బాలికలు వెల్లడించారని తెలిపారు. కౌన్సిలింగ్ అనంతరం బాలికలను కుటుంబ సభ్యులకు అప్పగించనున్నట్లు సీఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రామకృష్ణ, జిల్లా వెల్ఫేర్ అధికారిణి శైలజ పాల్గొన్నారు.

నగదుపై ప్రజల్లో అవగాహన కల్పించాలి

- కలెక్టర్ నిశాంత్‌కుమార్

రాయచోటి(నేతాజీసర్కిల్), అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): నగదుపై ప్రజల్లో అవగాహన కల్పించాలని కలెక్టర్ నిశాంత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ తన చాంబర్‌లో మీ డబ్బు- మీ హక్కు అనే నినాదంతో లీడ్ డిస్ట్రిక్ట్ బ్యాంక్ రూపొందించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం దేశవ్యాప్తంగా మూడు నెలల పాటు ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించిందని, ఖాతాదారులు తమ పేరుతో ఉన్న క్లైమ్ చేయని ఖాతాలు, ఇతర ఆర్థిక ఆస్తులను తిరిగి పొందే అవకాశం కల్పిస్తుందన్నారు. ఖాతాదారుల ఆర్థిక ఆస్తులు పరిపక్వతకు వచ్చిన తర్వాత అవి ఖాతాదారులకు అందకపోవడానికి చిరునామా మార్పు, నామిని లేకపోవడం వంటివి ముఖ్య కారణాలుగా ఉన్నాయని పేర్కొన్నారు. ఈ కారణాల వల్ల పెద్ద మొత్తంలో బీమా సంస్థలు బ్యాంకుల్లో నగదు క్లైమ్ చేయకుండా ఆగిపోయి ఉన్నాయన్నారు. ఈ సమస్యను పరిష్కరించడం కోసం ఆర్బీఐ, సెబీ, ఐఆర్డీఏఐలు సమన్వయంతో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. కార్యక్రమంలో ఎల్డీఎం ఆంజనేయులు, ఎస్బీఐ బ్యాంకు సిబ్బంది వన్నూరుబాషా తదితరులు పాల్గొన్నారు.

'సర్దార్' వల్లభాయ్ పటేల్ ఆదర్శాలను గుర్తించుకోవాలి : డీఆర్వో



సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డీఆర్వో మధుసూదన్‌రావు

రాయచోటి(నేతాజీసర్కిల్), అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): సర్దార్ వల్లభాయ్ ఆదర్శాలను గుర్తించుకొని మనమంతా ముందుకు సాగాలని డీఆర్వో మధుసూదన్‌రావు పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్ సమావేశం మందిరంలో పటేల్ 150వ జయంతిని పురష్కరించుకొని చిత్రపటానికి పూలమాల వేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ సర్దార్ వల్లభాయ్ పటేల్ స్వాతంత్ర్యానికి ముందు, స్వాతంత్ర్యం తర్వాత మన దేశానికి చేసిన సేవలను గుర్తించుకొని ఆయన నడిచిన బాటలో మనమందరం నడవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీ టూరిజం అధికారి నాగభూషణం, కలెక్టరేట్ ఏవో నాగభూషణం, వివిధ సెక్షన్ల సూపరింటెండెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.





కాలుష్యం కోరల్లో రైల్వే కోడూరు

● ఇబ్బందులు పడుతున్న ప్రజలు ● అలర్జీలు ,శ్వాసకోశ వ్యాధులతో ఆస్పత్రులపాలు

నిరంతరం వేలాది వాహనాల రద్దీ.. పల్వరైజింగ్ మిల్లులకు బెరైటీస్ ఖనిజం, అక్కడి నుంచి రైల్వే స్టేషను వద్దకు పౌడర్‌ను చేరవేసే లారీలు, టిప్పర్లతోపాటు, ఉద్యాన ఉత్పత్తులను తరలించేందుకు ఇతర ప్రాంతాల నుంచి వచ్చి వెళ్లే వాహనాలు రైల్వే కోడూరు పట్టణంలో వాయుకాలుష్యానికి కారణమవుతున్నాయి. దీంతో శ్వాసకోశ సంబంధిత వ్యాధుల బారిన పడి సతమతమవుతున్నామని పట్టణ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని అధికారులను, పాలకులను కోరుకుంటున్నారు.

రైల్వేకోడూరు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): రైల్వే కోడూరు పట్టణానికి సమీపంలోనే ఏపీఎండీసీ ఆధ్వర్యంలో మంగంపేట బెరైటీస్ గనులున్నాయి. పట్టణానికి సమీపంలోని అయ్యవారిపల్లె వద్ద బెరైటీస్ పల్వరైజింగ్ మిల్లులు పని చేస్తున్నాయి.



చిట్వేలి మార్గంలో రేగుతున్న దుమ్ము

నియోజకవర్గం ఉద్యాన పంటలకు కేంద్రం కావడంతో ఆయా ఉత్పత్తులను తీసుకు వెళ్లడానికి దేశంలోని అన్ని ప్రాంతాల నుంచి వాహనాలు వస్తుంటాయి. తిరుపతికి వెళ్లేందుకు, సమీపంలోని చెన్నై పోర్టుకు వెళ్లే ప్రధానం మార్గంలో పట్టణం ఉండడంతో అందుకు సంబం ధించిన భారీ వాహనాలు సైతం ఈ మార్గంలో ఎక్కువగా వెళుతుం టాయి. ఈ నేపథ్యంలో పట్టణంలోని రోడ్లపై పెద్ద ఎత్తున దుమ్ము, ధూళి రేగుతోంది. ఫలితంగా శ్వాసకోశ వ్యాధులు, అలర్జీల బారిన పడుతున్నామని స్థానికులు అంటున్నారు. ఈ దుమ్ము ధూళి ఇళ్లలో చేరుతుండడంతో కనీసం రెండు గంటలకోసారి ఇంటిని శుభ్రం చేసుకోవాల్సి వస్తోందని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంగంపేట ఏపీఎండీసీకి వెళ్లే ప్రధాన మార్గంలో లారీలు, టిప్పర్లు వెళ్లినప్పుడు దుమ్ము విపరీతంగా రేగుతుండడంతో ఆ మార్గంలో వెళ్లేటపుడు ముక్కు, నోరు మూసుకోవాల్సి వస్తోందని ప్రయాణికులు చెబుతున్నారు. ఇక మంగంపేట మొత్తం దుమ్ము, ధూళితో నిండిపోతోంది. దీంతో . మంగంపేట, కాపుపల్లె తదితర ప్రాంతాల్లో ప్రజలు నానా ఇబ్బం దులు పడుతున్నారు. ఈ దుమ్ము పీల్చిన వారికి ఆయాసం,



మంగంపేట సమీపంలో రేగుతున్న దుమ్ము

చర్మంపై దద్దులు, దురదలు వస్తున్నాయని ప్రజలు ఫిర్యాదు చేస్తు న్నారు. శాంతినగర్, మ్యాంగో మార్కెట్ యార్డు వరకు, బీఎస్ఎన్ఎల్ కార్యాలయం ఎదురుగా ప్రధానదారుల్లో దుమ్ము ప్రభావం ఎక్కువగా ఉంటోంది. ఇక వెంకయ్యస్వామి ఆలయం సమీపంలోని డంపింగ్ యార్డు దుర్వాసన వెదజల్లుతుంటుంది. ఇందులోని చెత్త చెదారాన్ని తరచూ కాలుస్తుండడంతో, ఆ పొగ ఇళ్లలోకి వచ్చి ఇబ్బంది పెడుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు.. ఇప్పటికైనా అధి కారులు తగు చర్యలు తీసుకుని దుమ్ము, ధూళి రాకుండా చేయా లని ప్రజలు కోరుతున్నారు.

అలర్జీలతో బాధపడుతున్నాం



దుమ్ము, ధూళితో అలర్జీలు, శ్వాసకోశ వ్యాధులతో ప్రజలు బాధపడుతున్నారు. రైల్వేకోడూరు ప్రధాన దారిలో ఈ సమస్య ఎక్కువగా ఉం ది. దీనిని అరికట్టకపోతే ప్రజలు మరిన్ని వ్యాధులతో బాధప డాల్సి వస్తుంది.అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలి.

- చెన్నంశెట్టి వెంకటరమణ, స్థానికుడు

దుమ్ము తట్టుకోలేకున్నాం



మంగంపేట వద్ద దుమ్ముతో ప్రజలు, ఇబ్బందులు పడుతున్నారు. టిప్పర్లు, పెద్ద, పెద్ద లారీలు, బస్సులు వెళ్లేప్పుడు విపరీతంగా దుమ్ము లేస్తోం ది. మంగంపేట ఏపీఎండీసీకి వెళ్లే మార్గంలో దుమ్ము రేగితే రెండు నిమిషాలు ఊరిపి బిగబట్టాల్సి ఉంటోంది.

-సిద్ధిలింగం మురళీకృష్ణ, స్థానికుడు

స్థలం విషయమై దాడి.. కేసు నమోదు

నిమ్మనపల్లి అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): ఇంటి స్థలం విషయంలో ఓ వ్యక్తిపై దాడి చేసి గాయపరచాడన్న ఆరోపణలతో రెడ్డిశేఖర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ కొండయ్యగారిపల్లి పంచాయతీ మిట్టమీదపల్లి వాసి వెంకటరమణ అదే గ్రామానికి చెందిన రెడ్డిశేఖర్ మధ్య కొంత కాలంగా ఇంటి స్థలం విషయమై తగాదా ఉంది. వెంకటరమణ ఇంటికి వెళ్లే రోడ్డులో శుక్రవారం రెడ్డిశేఖర్ మట్టిని తోలించాడు. ఈ మట్టిని వెంకటరణ చదును చేసుకుంటుండగా రెడ్డిశేఖర్ వచ్చి తన మట్టిని చదును చేయవద్దని గొడవకు దిగడంతోపాటు విచక్షణా రహితంగా కొట్టి గాయపరిచాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వడ్డీ వ్యాపారి దాడి.. ఒకరికి గాయాలు

మదనపల్లె అర్బన్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): వడ్డి వ్యాపారి దాడిలో ఓ వ్యక్తి గాయపడ్డాడు. మదనపల్లె మండలం ఇసుకనూతనపల్లెకు చెందిన శ్రీనివాసులు, ప్రభావతి దంపతులు రవి అనే వ్యక్తితో కొంత మొత్తం అప్పుగా తీసుకున్నారు. ఇందుకు సంబంధించి న వడ్డీ విషయమై గురువారం రాత్రి రవి ప్రభావతిని ప్రశ్నించాడు. దీంతో అవమానంగా భావించిన ఆమె వెంటనే క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. స్థానికులు ఆమెను మదనపల్లె ఆస్పత్రి కి తరలించారు. ఈ విషయమై శుక్రవారం ఉదయం శ్రీనివాసులు రవిని ప్రశ్నించగా ఆగ్రహానికి గురైన అతను అక్కడే ఉన్న కర్రతో దాడి చేశాడు. దీంతో గాయపడిన ఆయనను వెంటనే మదనపల్లె ఆస్పత్రికి తరలించగా తిరుపతికి రెఫర్ చేశారు. కేసు విచారణ చేస్తున్నట్లు తాలూకా పోలీసులు తెలిపారు.

గురుకుల పాఠశాల విద్యార్థి అదృశ్యం



చరణ్

తంబళ్లపల్లె, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): మండ ల కేంద్రంలోని ఎస్టీ బాలుర గిరిజన గురుకుల పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థి జే. చరణ్(14) శుక్రవారం తెల్లవారుజామున అదృశ్యమయ్యాడు. వివరాల మేరకు.. మదన ఎల్లె మండలం చీకలబైలుకు చెందిన శివ కుమారుడు జే.చరణ్ ఎస్టీ గిరిజన గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. శుక్రవారం తెల్లవారు జామున చదువుకోవడానికి హాస్టల్ సిబ్బంది విద్యార్థులను నిద్ర లేపారు. ఆ తర్వాత బాత్రూంకు వెళ్లొస్తానని చెప్పి.. హాస్టల్ ప్రహరీగోడ దూకి పారిపోయాడు. కొద్ది సేపటికి గమనించిన సిబ్బంది తల్లితండ్రులకు సమాచారం అందిం చారు. ఈ విషయంపై తండ్రి శివ స్థానిక పోలీస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ ఉమా మహేశ్వర్‌రెడ్డి హాస్టల్‌కు చేరుకుని ఆరా తీశారు. హాస్టల్‌తోపాటు, తంబళ్లపల్లె, మదనపల్లె రోడ్డులో పలు చోట్ల ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించారు. బాలుడు తంబళ్లపల్లె నుంచి మదనపల్లె వైపు నడుచు కుని వెళ్తున్నట్లు ఓ సీసీ కెమెరాలో రికార్డు అయిన దృశ్యాలను పోలీసులు గుర్తించారు. బాలుడు ఎక్కడైనా కనిపిస్తే తంబళ్లపల్లె పోలీసులకు కాని, హాస్టల్ సిబ్బందికి కాని సమాచారం అందించాలని ఎస్ఐ తెలిపారు. కాగా, అదృశ్యమైన బాలుడు గురువారం రోజు రాత్రి హాస్టల్‌లో తోటి స్నేహితుడితో గొడవ పడినట్లు తెలిసింది. టీచర్లు మందలిస్తారనే భయంతో పారిపోయినట్లు చెబుతున్నారు. ఈ ఘటన పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఉమా మహేశ్వర్‌రెడ్డి తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరి మృతి

రామాపురం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. లక్కిరెడ్డిపల్లె సీఐ కొండారెడ్డి కథ నం మేరకు.. రాయచోటి రింగు రోడ్డు పరిధిలో ఉన్న ఓ హోటల్‌లో హరీఫ్(40) అనే వ్యక్తి పనిచేస్తుండేవాడు. శుక్రవారం రాత్రి మద్యం సేవించి కాలినడకన వెళుతుండగా బండపల్లె పంచాయతీ భారత్ పెట్రోలు బంకు సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దీంతో ఆయన అక్కడిక్కడే మృతి చెందాడు. సంఘటనా స్థలాన్ని సీఐ కొండారెడ్డి పరిశీలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. మృత దేహాన్ని లక్కిరెడ్డిపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పరిశోధనలపై ఆసక్తి పెంచుకోవాలి

● ప్రొఫెసర్ బిందు మాధవరెడ్డి

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశలో పరిశోధనలపై ఆసక్తిని పెంచుకోవాలని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ అనిమల్ బయాలజీ శాఖ ప్రొఫెసర్ బిందుమాధవరెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన యోగివేమన విశ్వవిద్యాలయంలో స్కాలర్లకు విద్యార్థులకు డయాబెటిస్, కేన్సర్‌లో శక్తి సమతుల్యత (ఎనర్జీ హోమియోస్టాసిస్ ఇన్ డయాబెటిస్ అండ్ కేన్సర్) అనే అంశంపై అతిథి ఉపన్యాసం ఇచ్చారు. కేన్సర్ డయాబెటిస్‌పై ప్రస్తుతం జరుగుతున్న పరిశోధనలపై అవగాహనకల్పించారు. యువ పరిశోధకుల భాగస్వామ్యం గురించి ప్రస్తావించారు. యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ నుంచి వచ్చిన మరో ప్రొఫెసర్ రాజమోహన్‌రాయ్ యువత పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు అవసరమైన ఆలోచన విధానం, లక్షణాలపై అవగాహన కల్పించారు. విద్యార్థుల సందేహ నివృత్తి చేశారు. వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బెల్లంకొండ రాజశేఖర్, ప్రొఫెసర్ బిందు మాధవరెడ్డిని, ప్రొఫెసర్ రాజమోహన్‌రాయ్‌లను విశ్వవిద్యాలయం తరఫున సత్కరించారు.

అమరవీరుల కుటుంబాలకు అండగా నిలుద్దాం..

● ఎస్పీ ధీరజ్ కునుబిల్లి

రాయచోటిటౌన్, అక్టోబరు31(ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరులను స్మరించుకోవడంతో పాటు వారి కుటుంబాలకు అండగా నిలబడదామని అన్నమయ్య జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి పిలుపునిచ్చారు. అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా జిల్లా వ్యాప్తంగా విద్యార్థులు, పోలీసు పిల్లలు, పోలీసులకు నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి శుక్రవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఆయన ప్రశంసా పత్రాలతో పాటు నగదు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ విద్యార్థులు చదువుపై శ్రద్ధ వ హించాలని సూచించారు. భవిష్యత్తులో పోటీ పరీక్షల్లో విజయం సాధించే దిశగా కృషి చేయాలన్నారు. విజేతలైన విద్యార్థులు తమ తల్లిదండ్రులకు మంచి పేరు ప్రఖ్యాతలు తెచ్చిపెట్టే విధంగా ప్రవర్తించాలని ఆకాంక్షించారు. పోలీసు సిబ్బంది తమ వృత్తిలో మరింత నైపుణ్యం, అంకితభావం చూపాలని దిశానిర్దేశం చేశారు. అనంతరం వ్యాసరచన పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులు ఎస్. సాయిభార్గవ్, కే. యశిత,సాయిహర్షిణి, వక్తృత్వ పోటీ విజేతలు ఎం. భవ్యశ్రీ, ఎం. విజయలక్ష్మి, ఎస్. సుభాన్, వ్యాస రచన పోటీ విజేతలుగా నిలిచిన పోలీసు పిల్లలు ఎం. సంధ్యారాణి, ఆర్. వర్షిణి, కే. జాహ్నవి, వక్తృత్వ పోటీల్లో విజేతలుగా నిలిచిన ఆర్. వర్షిణి, ఆర్. భవ్యశ్రీ, ఏ. గవల్ , వ్యాసరచన పోటీల్లో



వ్యాసరచన, వక్తృత్వ పోటీ విజేతలతో ఎస్పీ ధీరజ్ కునుబిల్లి, అదనపు ఎస్పీ వెంకటాద్రి

విజయాలు సాధించిన పోలీసు అధికారులు కే. మెహరాజ్ (ఉమెన్ పీసీ), బీ. బాలకృష్ణ (ఎస్ఐ), కే. శ్రీనాధ (పీసీ), వక్తృత్వ పోటీల్లో విజేతలు షేక్. మెహరాజ్ (ఉమెన్ పీసీ), బీ. బాలకృష్ణ (ఎస్ఐ), ఏ. సురేఖ (ఉమెన్ పీసీ)లకు మొదటి బహుమతి కింద రూ.5 వేలు, రెండవ బహుమతి రూ.3 వేలు, మూడవ బహుమతి రూ.2 వేలు చొప్పున నగదు బహుమతులతో పాటు ప్రశంసా పత్రాలను అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ వెంకటాద్రి, ఏఆర్ డీఎస్పీ ఎం. శ్రీనివాసులు, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, పోలీసు సిబ్బంది, అధ్యాపకులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

రెవెన్యూ డివిజన్ డిమాండ్‌కు పెరిగిన మద్దతు

పీలేరు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): పీలేరును రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ప్రకటించాలన్న డిమాండుకు పీలేరులో మద్దతు పెరుగుతోంది. రెవెన్యూ డివిజన్ సాధన సమితి ఆధ్వర్యంలో శుక్రవారం రెండో రోజు రిలే నిరాహార దీక్షలు కొనసాగాయి. వైసీపీ, ఎస్ఎస్‌యూఐ, స్థానిక ముస్లిం జమాయత్ మద్దతు ప్రకటించాయి. స్థానిక జామియా మసీదు ముతవల్లి అల్లావుద్దీన్ మాట్లాడుతూ అనాదిగా పీలేరుకు అన్యాయం జరుగు తోందని, నూతన జిల్లాల ఏర్పాటు సందర్భంగానైనా న్యాయం చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. స్వయం అభివృద్ధి చెందిన పీలేరుకు ప్రభుత్వ అండ లభిస్తే మరింత అభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. వైసీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి చక్రధర్ మాట్లాడుతూ పీలేరు ప్రాంత ప్రజల మనోభావాలను గౌరవిస్తూ పీలేరులో రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలన్నారు. ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అమృతతేజ మాట్లాడుతూ పాలనా సౌలభ్యం కోసం నూతన జిల్లాల ఏర్పాటు, పాత జిల్లాల విభజన చేస్తున్న ప్రభుత్వం అదే మాటకు కట్టుబడి పీలేరును



రిలే దీక్షలకు సంఘీభావం తెలుపుతున్న ముస్లిం జమాయత్ సభ్యులు

రెవెన్యూ డివిజన్ చేయాలన్నారు. అనంతరం ముస్లిం జమాయత్ సభ్యులు తహసీల్దారుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సాధన సమితి సభ్యులు సుధాకర్, భాను, పాలకుంట శ్రీనివాసులు, ముతవల్లీలు సైఫుల్లా, రియాజ్, షౌకత్ అలీ, తమీమ్, రఫీ, ఇబ్రహీం, తదితరులు పాల్గొన్నారు.

అవినీతి రహితంగా ఉపాధి హామీ పనులు

● జిల్లా నీటి యాజమాన్య సంస్థ సంచాలకుడు వెంకటరత్నం

రైల్వేకోడూరు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ఉపాధి పనులు అవినీతి రహితంగా జరగాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ సంచాలకులు వెంకటరత్నం తెలిపారు. శుక్రవారం రైల్వేకోడూరు మండల పరిషత్ సభాభవనంలో కోడూరు, ఓబులవారిపల్లె, చిట్వేలి మండలాలకు చెందిన ఉపాధి హామీ పథకం సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈకేవైసీ కార్యక్రమాన్ని వంద శాతం పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వం, ప్రైవేటు రంగాలు కలసి అవినీతిని కలసికట్టుగా నిర్మూలించాలన్నారు.



సమావేశం లో మాట్లాడుతున్న జిల్లా ఉపాధి సంచాలకుడు వెంకటరత్నం

జాబ్‌కార్డుల వందశాతం ఈకేవైసీ ద్వారా జవాబుదారీతనంతో ఉపాధి పథకాన్ని నిర్వహించవచ్చునని తెలిపారు. పండ్ల తోటల పెంపకానికి లబ్దిదారులను గుర్తించాలని అధికారులను ఆదేశిం చారు. పండ్ల తోటలను నాటి వాటిని పోషించుకునేందుకు రైతులకు అవకాశం కల్పించాలన్నారు. కాటిల్ షెడ్లు, సోక్ పిట్స్, నీటి కుంటలు, సామూహిక తోటల పెంపకం, రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటే కార్యక్రమాలను ముమ్మరంగా చేపట్టాలన్నారు. రైతాంగానికి ఎక్కువగా ఉపయోగపడే పనులను గుర్తించి నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాజంపేట అసిస్టెంట్ సంచాలకులు సన్నపునేని మృత్యుంజ యరావు, ఎంపీడీవో నాగిరెడ్డి, కోడూరు, ఓబులవారిపల్లె, చిట్వేలి మండలాల ఏపీవోలు, టెక్నికల్ అసిస్టెంట్లు, క్షేత్రసహాయకులు తదితరులు పాల్గొన్నారు.

రాజంపేట : రాజంపేట మండల పరిషత్ సభాభవనంలో రాజంపేట, నందలూరు, పుల్లంపేట, పెనగలూరు మండలాల ఉపాధి హామీ సిబ్బందితో పీడీ సమీక్ష నిర్వహిం చారు. . ఈ కార్యక్రమంలో నరసింహమూర్తి, డీఎల్డీవో, రాజంపేట అసిస్టెంట్ పథక సంచాలకులు ఏపీడీ, రాజంపేట క్లస్టర్ సన్నపనేని మృత్యుంజయరావు, స్థానిక ఎంపీడీవో వరప్రసాద్, నందలూరు, పెనగలూరు ఎంపీడీవోలు ప్రసాద్, విజయరావు, ఏపీవోలు, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్‌లు తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరు రోడ్డుకు మరమ్మతులు

పీలేరు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): పీలేరు-చిత్తూరు మార్గంలోని రైల్వే గేటు వద్ద బురదమయమైన రోడ్డుకు ఆర్వోబీ కాంట్రాక్టు సంస్థ శుక్రవారం తాత్కాలిక మరమ్మతులు చేసింది. పీలేరు -చిత్తూరు, పీలేరు-మదనపల్లె మార్గాల్లో ఆలస్యంగా సాగుతున్న ఆర్వోబీల నిర్మాణ పనుల కారణంగా ప్రజలు పడుతున్న ఇబ్బందులను ప్రతిబింబిస్తూ ఆంధ్రజ్యోతిలో శుక్రవారం 'జారుడు బండలో జారినట్టే...!' అన్న కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఆ కథనంపై తహసీల్దారు శివకుమార్ స్పందించారు. వెంటనే చిత్తూరు మార్గంలో తాత్కాలికంగానైనా రోడ్డు ఏర్పాటు చేయాలని ఆర్వోబీ కాంట్రాక్టు సంస్థను ఆదేశించారు. దీంతో ఆ మార్గంలో శుక్రవారం ఉదయం రోడ్డు రోలరుతో మట్టి, కంకర తొక్కించి తాత్కాలిక రోడ్డు ఏర్పాటు చేశారు. దీంతో ఆ మార్గంలో వాహనాల రాకపోకలకు కాసింత అనువైన రోడ్డు ఏర్పాటైంది. పీలేరు-మదనపల్లె మార్గం



రోడ్డుకు మరమ్మతులు చేయడంతో సాఫీగా వెళుతున్న వాహనాలు

లోని రోడ్డులో దుమ్ము రేగకుండా ట్యాంకర్లతో పలుదఫాలుగా నీటిని చల్లించారు. కేవలం తాత్కాలిక పనులకు పరిమితం కాకుండా ఆర్వోబీలను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని తహసీల్దారు కాంట్రాక్టు సంస్థ సిబ్బందిని ఆదేశించారు.

అయాన్‌కు అండగా నారా లోకేశ్!

బి.కొత్తకోట, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): కిడ్నీ సమస్యతో సతమతమవుతున్న బాలుడు అయాన్‌ను ఆదుకోవాలని టీడీపీ నేత నారా లోకేశ్ నిర్ణయించారు. బాలుడి వైద్యానికి కావాల్సిన అన్ని సదుపాయాలు కల్పించాలని తన టీంను ఆదేశించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. బి.కొత్తకోటకు చెందిన ఆటోడ్రైవర్ సమీవుల్లా, షమీ దంపతుల కుమారుడు అయాన్ ఇటీవల మిద్దెపై నుంచి ప్రమాదవశాత్తు కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. బాలుడిని ఆసుపత్రికి తరలించగా కిడ్నీలు దెబ్బతిన్నట్లు వైద్యులు నిర్ధారించారు. శక్తికి మించిన పని కావడంతో తమ బిడ్డ ప్రాణాలు కాపాడాలని సామాజిక మాధ్యమాల్లో ు కోరారు. ఈ విషయం నారా లోకేష్ దృష్టికి వెళ్లడంతో ఆయన స్పందించి మానవత్వం చాటుకున్నారు. ఆయాన్ కోలుకోవడానికి అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని ప్రకటించారు. బాలుడు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ విషయం బహిర్గతం కావడంతో బాలుడి తల్లితండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఉమ్మడి కడప జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ ఎంపికలు

రాయచోటిటౌన్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి కడప జిల్లా స్థాయి అండర్ -14, అండర్-17 బాలబాలికల విభాగాల్లో శుక్రవారం రాయచోటి పట్టణంలోని మాసాపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి, వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీకాంత్‌రెడ్డి, జగదీశ్వరయ్యల ఆధ్వర్యంలో సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ క్రీడల్లో ఎంపికలు నిర్వహించారు. ఈ ఎంపికలకు సుమారు 300 మందికిపైగా క్రీ డాకారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు మనోహర్‌బాబు మాట్లాడుతూ ఎంపికైన క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో పాల్గొని జిల్లా జట్టుగా మంచి ప్రతిభ కనపర్చి రాష్ట్ర స్థాయిలో మంచి ఫలితాలు సాధించాలని పిలుపునిచ్చారు. సాఫ్ట్‌బాల్ అండర్- 14, బాలుర విభాగంలో 16 మంది, బాలికల విభాగంలో 16 మంది, అండర్-17 బాలుర విభాగంలో 16 మంది, బాలికల విభాగంలో 16 మంది, బేస్‌బాల్‌లో అండర్-14 బాలుర విభాగంలో 16 మంది, బాలికల విభాగంలో 16 మంది, అండర్-17 బేస్‌బాల్‌లో బాలుర విభాగంలో 16 మంది, బాలికల విభాగంలో 16 మందిని ఎంపిక చేశారు. ఈ జట్లు నవంబర్‌లో పులివెందుల, నంద్యాల, చిత్తూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో జరగబోయే రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు మనోహర్‌రెడ్డి, లలితమ్మ, సుబ్రమణ్యం, వేణుమాధవ్‌రాజు, లలితమ్మ, సుబ్రమణ్యం, వేణుమాధవ్‌రాజు, రవీందర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీలకు ఎంపికలు: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణంలో ఉమ్మడి కడప జిల్లా స్థాయి కబడ్డీ పోటీలకు అండర్-17 విభాగంలో బాల, బాలికలకు జిల్లా స్థాయి ఎంపికలు నిర్వహించారు. 180 మంది క్రీడాకారులు పాల్గొన్నట్లు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరీ శ్రీకాంత్‌రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ వీరాంజనేయులు తెలిపారు. అండర్-17 విభాగంలో కబడ్డీ పోటీలకు జిల్లా స్థాయి ఎంపికలు ప్రశాంతంగా పూర్తి చేశారు. ఈ కార్యక్రంలో ప్రధానోపాధ్యాయులు త్రివేణి, స్కూల్ కమిటీ చైర్మన్ ఎజాజ్‌ఖాన్, యూసుఫ్‌అలీ, ఏపీ పీఈటీ అండ్ ఎస్‌ఏపీఈ అసోషియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రవీణ్‌కిరణ్, ఉమ్మడి కడప జిల్లా నలుమూలల నుండి వచ్చిన పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

పశు వైద్యులు ప్రజలకు అందుబాటులో ఉండాలి

వీరబల్లి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ప్రతిరోజు ప్ర జలకు అందుబాటులో ఉండి పశువులకు వైద్యసేవలు అం దించాలని జిల్లా పశు వైద్యా ధికారి గుణశేఖర్‌పిళ్లై ఉప సంచాలకులు మాలకొండయ్య సూచించారు. శుక్రవారం వంగిమళ్ల, దిగువ రాచపల్లి, వీరబల్లి పశువైద్యశాలలను తనిఖీ చేశారు. ప్రస్తుతం పశువులకు సోకు తున్న వ్యాధులపై ఆరా తీశారు. సిబ్బందికి తగు సలహాలు, సూచనలు ఇచ్చారు. అనంతరం వడ్డెపల్లెలో పందుల పెంపకం షెడ్డును పరిశీలించారు. తుఫాన్ కారణంగా పందులకు ఏమైనా రోగాలు వచ్చాయా అని ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పశువులకు గొంతువాపు టీకాలు వేయించండి

ఒంటిమిట్ట, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : పశువులకు గొంతువాపు టీకాలు వేయిం చాలని పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ శ్రీనివాసులు సూచించారు. శుక్రవారం ఒంటిమిట్ట రాచగుడిపల్లె, మంటపంపల్లెలోని పశువుల ఆసుపత్రిని తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ మండలంలోని పశువులకు గొంతువాపు టీకాలు తప్పక వేయించాలన్నారు. ఏడీ ఉమా మాట్లాడుతూ మండలంలో సిబ్బందితో పాటు మందుల కొరత అంశాన్ని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. చివరిసారిగా 2024 డిసెంబరులో మందులు వచ్చాయని ఫిర్యాదు చేశారు. వర్షాకాలంలో పశువుల గిట్టలకు పుండ్లు ఏర్పడుతాయని, వీటి నివారణకు కూడా మందుల కొరత ఉన్నదన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ స్వాతి, సిబ్బంది సుబ్బలక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

'అమృత సంభాషణ' విజయవంతం చేద్దాం

కడప ఎర్రముక్కపల్లె, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): వికసిత భారత్-2047 లక్ష్యాన్ని సాధించేందుకు కేంద్ర ప్రభుత్వంచేపట్టిన అమృత సంభాషణ కార్యక్రమం విజయవంతం చేయాలని సీనియర్ డీఈ ఎన్ సుదర్శన్‌రెడ్డి కోరారు. శుక్రవారం కడప రైల్వే స్టేషన్ వీఐపీ లాంజ్‌లో అమృత్ సంవాద్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేగవంతమైన వందే భారత్ రైళ్లు, ఆధునిక స్టేషన్లు, ఎలక్ట్రిఫికేషన్ వంటి సంస్కరణలు భారత రైల్వేను కొత్త శకానికి చేర్చాయని వివరించారు. అమృత సంభాషణ ద్వారా ప్రజల ఆలోచనలు ప్రభుత్వ విధానాల్లో ప్రతిఫలించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఏడీఈఎన్ అశోక్‌కుమార్ స్టేషన్ అభివృద్ధి కమిటీ సభ్యులు నాగిరెడ్డి, కృష్ణారావు, పద్మావతి, శ్రీనివాసులు,ప్రవీణ్‌నాయుడు పాల్గొన్నారు.

రైలు ప్రయాణికులకు వసతులు కల్పించండి

రాజంపేట, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులకు మెరుగైన వసతులు కల్పించాలని గుంతకల్ రైల్వే డీఆర్‌సీ సభ్యుడు తల్లెం భరత్‌కుమార్‌రెడ్డి కోరారు. శుక్రవారం రైల్వే అధికారులతో కలిసి రాజంపేట రైల్వేస్టేషన్‌లో అభివృద్ధి పనులను పరిశీలించి తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమృత సంవాద్ పథకం కింద రాజంపేట రైల్వేస్టేషన్‌కు 20 కోట్ల రూపాయలు మంజూరు చేసిందన్నారు. ఈ నిధులతో రైల్వేస్టేషన్ ఆధునీకరణ, ఎస్కలేటర్, లిఫ్ట్, కొళాయిల ఏర్పాటు, అధునాతన టికెట్ కౌంటర్ ఏర్పాటు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో రైల్వే సీనియర్ డీన్ సుదర్శన్‌రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ రాజగోపాల్‌రెడ్డి, ఎలక్ట్రికల్ డీఈ శ్రీనివాసులు, వాసుదేవనాయుడు, సనిశెట్టి నవీన్, జనార్ధన్‌రెడ్డి, గోపినాథ్ తదితరులు పాల్గొన్నారు.

అనుమతులు లేకుండా క్వారీలు నిర్వహిస్తే చర్యలు

వాల్మీకిపురం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): అనుమతు లు లేకుండా క్వారీలు నిర్వ హిస్తే కఠిన చర్యలు తప్ప వని మైన్స్ ఏజీ.శివప్రసాద్ హెచ్చరించారు. అనధికా రికంగా క్వారీయింగ్ చేస్తు న్నారన్న ఫిర్యాదులు అంద డంతో శుక్రవారం మండలం లోని టి.సాకిరేవుపల్లె వద్ద క్వారీలను పోలీసులు, రెవెన్యూ అధికారులతో కలిసి తనిఖీ చేశారు. గ్రామస్తులను విచారణ చేసి వివరాలు తెలుసుకు న్నారు. అనంతరం మాట్లాడుతూ అనుమతులు లేకుండా క్వారీయింగ్ నేరమని, తమకు అందిన ఫిర్యాదుపై తప్పకుండా చర్యలు తీసుకుం టామన్నారు. కార్యక్రమంలో సీఐ రాఘవరెడ్డి, తహసీల్దార్ పామిలేటి, ఎస్ఐ చంద్రశేఖర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సీడీసీఈబీ కార్యదర్శిగా తాటిపర్తి గంగాధరం

పీలేరు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా ఉమ్మడి పరీక్షల విభాగం(సీడీసీఈబీ) కార్యదర్శిగా వేపులబైలు పంచాయతీ జంగంపల్లె జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం గంగాధరాన్ని నియమిస్తూ జిల్లా విద్యాశాఖాధికారి సుబ్రహ్మణ్యం గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇది వరకు ఆ పోస్టులో నాగమునిరెడ్డి ఉండేవారు. గంగాధరం మాట్లాడుతూ తనపై నమ్మకంతో తనను సీడీసీఈబీ కార్యదర్శిగా నియమించినందుకు జిల్లా విద్యాశాఖాధి కారికి కృతజ్ఞతలు తెలిపారు. పరీక్షల పారదర్శక నిర్వహణకు సంబంధిం చిన విధులు, తన పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఈ సంద ర్భంగా ఆయనను ఎస్టీపీఏ రాష్ట్ర అధ్యక్షుడు కొండూరు శ్రీనివాస రాజు, జిల్లా అధ్యక్షుడు పీవీ రమణ, ప్రధాన కార్యదర్శి దుర్గాప్రసాద్, సభ్యులు విశ్వనాథ్, రమణ, వేణుగోపాల్ రెడ్డి, వైవీ రమణ, తదితరులు అభినం దించారు.

వీరశైవ జంగాలకు ప్రాధాన్యమివ్వాలి

కలికిరి, అక్టోబరు 31 (ఆంధ్ర జ్యోతి): శ్రీశైలం ఆలయంలో వీరశైవ జంగాలకు అన్ని విషయాల్లో ప్రాధాన్యం కల్పించాలని రాష్ట్ర జంగమ సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ అధ్యక్షుడు వాసునూరి చంద్ర శేఖర్ కోరారు. రాజంపేటలో శ్రీశైలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్మన్ పోతుగుంట రమేష్ నాయుడును శుక్రవారం కలిసి అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ప్రధాన శైవాలయమైన శ్రీశైలంలో వీరశైవ జంగాలకు సముచిత స్థానం కల్పించాలని కోరారు. దర్శనాలు, వ్యాపార సముదాయాల నిర్వహణ, జంగం దేవర్ల సత్రాల ఏర్పాటు, ఆలయ అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రాధాన్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఆలయ వాణిజ్య నిర్వహణా వ్యవహారాల్లో అన్యమతస్తులను దూరంగా ఉంచాలని సూచించారు. అన్ని వర్గాల శైవులు, వీరశైవులు, వాటి శాఖల వారిని చేరదీసి ఆలయ అభివృద్ధిలో పాలుపంచుకునేలా ప్రోత్సహించాలని సూచించారు. వీరశైవ జంగాలకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందజేసేందుకు చైర్మన్ రమేష్ నాయుడు సానుకూలంగా స్పందించి హామీ ఇచ్చినట్లు చంద్రశేఖర్ వివరించారు.

జగనన్న మార్ట్‌కు వసూళ్లు

● 1344 డ్వాక్రా సంఘాల నుంచి రూ.20.16లక్షల సేకరణ ● ఏడాది తర్వాత రూ.6.72లక్షలు తిరిగి చెల్లింపు ● రూ.13లక్షలపై విచారణ కమిటీలు ● తేలని వ్యవహారం

పులివెందులలో జగనన్న మార్ట్ పేరుతో డ్వాక్రా సంఘాలలో ఒక్కొక్క సంఘం నుంచి రూ.1500 చొప్పున రూ.20.16లక్షలు వసూలు చేశారు. మూడేళ్లపాటు ఈ మార్ట్‌లో వ్యాపారాలు సాగించారు. డ్వాక్రా సంఘాలకు ఏడాదిలో ఒక్కొక్క సంఘానికి రూ.500 వెనక్కి తిరిగి చెల్లింపులు సాగినా పూర్తిమొత్తం ఎవరి దగ్గరుందో అంతుబట్టడం లేదు. ఇప్పటికే రెండు కమిటీలు విచారణ చేపట్టినా తేలలేదు.





పులివెందులలో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహిళా మార్ట్ (జగనన్న మార్ట్)

పులివెందుల రూరల్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): పులివెందుల మున్సిపాలిటీ పరిధిలో మెప్మా ఆధ్వర్యంలో దాదాపు 1344 గ్రూపులు ఉన్నాయి. 2021లో ఉన్న ఈ గ్రూపుల్లోని సభ్యులను వ్యాపార భాగస్వామ్యులను చేస్తూ జగనన్న మార్ట్ పేరుతో ఓ సూపర్‌మార్కెట్ ఏర్పాటు చేశారు. అందులో లాభమైనా, నష్టమైనా అందరికీ చెందాల్సిందే. ఇది ఒకరకంగా మహిళలకు ఆర్థిక భరోసాగా నిలిచే కార్యక్రమమైనా కొందరి అవినీతి ఆలోచనలతో భారీ అవకతవకలు చోటుచేసుకున్నాయి. ఈ మార్ట్‌లో ఏర్పాటు చేసిన వస్తువులను నెలనెలా ఈ గ్రూపుల్లోని సభ్యులే కొనుగోలు చేస్తుండేవారు. ధరల్లో వ్యత్యాసాలు ఉన్నాయని అప్పట్లో పలువురు మహిళలు ప్రశ్నించారు. అయితే ఆర్పీలు, మెప్మా సిబ్బంది ఇందులో వచ్చే లాభాలు మీకే వస్తాయి కదా అని వారిని ఏమార్చి వస్తువులను కట్టబెట్టేవారు. ఏడాది అనంతరం 1344గ్రూపులకు ఒక్కో గ్రూపునకు రూ.500 వెనక్కి ఇచ్చేశారు. అంటే దాదాపు రూ.6.72లక్షలు చెల్లించారు. అయితే మిగిలిన రూ.13.44లక్షలు ఏమైపోయాయో ఎవరికీ అంతుబట్టడం లేదు.

కొనుగోళ్లు-విక్రయాలు

పెద్దఎత్తున కొనుగోలు చేస్తే డీలర్ వద్ద ఎమ్మార్పీ కంటే తక్కువగానే ఉంటుంది. అయితే జగనన్న మార్ట్‌లో ఎమ్మార్పీ కంటే దాదాపు రూ.5 నుంచి రూ.10 ఎక్కువగా విక్రయాలు జరిపినట్లు పలువురు డ్వాక్రామహిళలు చెబుతున్నారు. ఈ లెక్కన ఎంత ఆదాయం వస్తుందంటే.. ఉదాహరణకు 100 సన్‌ఫ్లవర్ ఆయిల్ ప్యాకెట్లు డీలర్ వద్ద కొంటే ఒక్కో ప్యాకెట్ ధర రూ.130లు (ఎమ్మార్పీ రూ.150) అనుకుంటే రూ.13000పెట్టుబడి పెట్టినట్లు లెక్క. కానీ జగనన్న మార్ట్‌లో విక్రయించిన ధర రూ.160. అంటే 100 సన్‌ఫ్లవర్ ఆయిల్ ప్యాకెట్లు విక్రయిస్తే రూ.16000 వస్తుంది. ఇందులో ఆదాయం రూ.3000. రవాణా చార్జీలు రూ.200 తీసేసినా రూ.2800 మిగులుతుంది. ఇలాంటి వ్యాపారం దాదాపు మూడేళ్ల సాగింది. కాగా ఇలాంటి నిత్యావసర వస్తువులు ఎన్ని ఉంటాయో అందరికి తెలిసిన విషయమే. వీటన్నిపైనా రూ.5 నుంచి రూ.10 ఎక్కువకు కొనుగోలు చేస్తే ఎంత మొత్తం అవుతుందనేది ఊహకందనిది.

అవినీతి పాత్ర ఆర్పీలదే..

డ్వాక్రా మహిళలు పెట్టుబడి పెట్టే విషయంలో ఆర్పీ పాత్ర ఎక్కువగా ఉందని పలువురు డ్వాక్రామహిళలే బహిరంగంగా చెబుతున్నారు. వ్యాపారంలో భాగస్వామ్యులు కావాలని, మనకు తక్కువకే సరుకులు దొరుకుతాయని నమ్మబలికి ఒక్కొక్కరిచే రూ.150 గ్రూపు అంతా కలిసి రూ.1500 కట్టించుకున్నారు. పులివెందుల మెప్మాలో దాదాపు 44 మంది ఆర్పీలు ఉన్నారు. వీరంతా వారివారి గ్రూపుల వారితో రూ.1500 చొప్పున కట్టించి జగనన్న మార్ట్‌కు చెల్లించారు. ఇలా దాదాపు రూ.20.16లక్షలు జగనన్న మార్ట్ కోసం వసూళ్లు చేశారు. ఇప్పటి వరకు ఒక్కో గ్రూపునకు రూ.500 అంటే రూ.6.72లక్షలు చెల్లించారు. మిగిలిన డబ్బు ఏమైందంటే ఒకరిపై ఒకరు నెపం వేసుకుంటూ మహిళలను మభ్యపెట్టారు. మొత్తానికి మార్ట్ మూతపడేలా చేసేశారు. పెట్టుబడి డబ్బు కూడా పూర్తిగా రాకపోవడంతో మహిళలు లబోదిబోమంటున్నారు. ఈ అవినీతిలో ఆర్పీలే ఎక్కువగా దోచుకున్నారని పలువురు మహిళలు బహిరంగంగానే చెబుతున్నారు. రూ.13.44 లక్షలు ఏమైపోయాయో అంతుపట్టని ప్రశ్నగా మిగిలిందని ఆరోపిస్తున్నారు.

మరో కమిటీని నియమిస్తాం..

జగనన్న మార్ట్‌లో జరిగిన అవినీతిపై మెప్మా పీడీ కిరణ్‌కుమార్‌ను ఆంధ్రజ్యోతి వివరణ కోరింది. ఇందుకు ఆయన స్పందిస్తూ రెండు కమిటీల ద్వారా విచారణ జరగలేదు. మరోమారు కమిటీని నియమించేందుకు సిద్ధమవుతున్నామని, త్వరలో నిజానిజాలు వెలికితీస్తామని ఆయన వివరించారు.

విచారణ శూన్యం

జగనన్న మార్ట్‌లో అవినీతి జరిగిందనే విషయం బయటకు పొక్కింది. దీంతో జగనన్న మార్ట్‌ను మూసేసి విచారణ చేస్తామని మెప్మా జిల్లా స్థాయి అధికారులు ప్రకటించారు. మొదటిసారి వేసిన కమిటీ చేతులెత్తేసింది. రెండోసారి వేసిన కమిటీ కూడా చేతులెత్తేసి ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నారు. రాజకీయ ఒత్తిళ్లతోనే విచారణ ముందుకు సాగడం లేదని తెలుస్తోంది. ఎవరైనా ప్రశ్నిస్తే వారికి రాజకీయ ఒత్తిళ్లు, లేదంటే వచ్చే రుణాన్ని ఆలస్యం చేయడం వంటి ఇబ్బందులకు ఆర్పీలు గురి చేస్తున్నారని చెబుతున్నారు. ఇదిలా ఉండగా కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఫోటో ఏర్పాటు చేసి మహిళా మార్ట్ అని బోర్డు ఏర్పాటు చేశారు. కానీ అందులోని అవినీతిని వెలికి తీయలేకపోవడం స్పష్టమవుతోంది.

తమ పేర్లు చెప్పాడని జూనియర్‌పై సీనియర్ల దాడి

● కౌన్సెలింగ్ ఇచ్చిన పోలీసులు
● ఇంటికి తీసుకెళ్లిన తల్లిదండ్రులు
● ఆలస్యంగా వెలుగులోకి

పులివెందుల రూరల్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): హాస్టల్‌లో బీడీలు, సిగరెట్లు, గుట్కా ప్యాకెట్లు ఉన్నాయి.. ఇవి ఎలా వచ్చాయని స్థానిక ప్రజలు హాస్టల్‌లో ఉంటున్న ఓ విద్యార్థిని అడిగారు. దీంతో ఆ విద్యార్థి వాటిని పీల్చే అలవాటు ఉన్న విద్యార్థుల పేర్లు చెప్పడంతో స్థానికులు హాస్టల్ వార్డన్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో వారి ముందే సదరు విద్యార్థులను వార్డన్ మందలించాడు. దీనిని మనసులో పెట్టుకున్న డిగ్రీ కళాశాల విద్యార్థులు ఇంటర్ విద్యార్థిపై దాడికి దిగారు. ఐదురోజుల క్రితం జరిగిన ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికులు, పోలీసులు, విద్యార్థులు తెలిపిన వివరాల మేరకు... పట్టణంలోని గాయత్రీనగర్ కాలనీలో ప్రభుత్వ బీసీ బాలుర కళాశాల వసతి గృహంలో ఇంటర్, డిగ్రీ చదివే విద్యార్థులు వసతి పొందుతున్నారు. కాగా ఐదురోజుల కిందట ఇంటర్ విద్యార్థిపై డిగ్రీ చదువుతున్న విద్యార్థులు దాడి చేసి గాయపరిచారన్నారు. దాడి చేసినవారు చెడు అలవాట్లు ఉన్న విద్యార్థులే అని తెలిసింది. దాడి అనంతరం గాయపడిన విద్యార్థి తన తల్లిదండ్రులకు చెప్పడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో విద్యార్థులను పిలిపించి పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చి మళ్లీ ఇలాంటివి జరిగితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అనంతరం గాయపడిన విద్యార్థిని తల్లిదండ్రులు ఇంటికి తీసుకెళ్లినట్లు సమాచారం. అయితే దాడి చేసిన విద్యార్థులు హాస్టల్‌కు రాలేదని తెలిసింది. విద్యార్థులు ఇష్టానుసారం ఎప్పుడు పడితే అప్పుడు వస్తుంటారని, ఒక్కోసారి గట్టిగా అరుస్తుంటారని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. వీరిని హాస్టల్ వార్డన్‌పై ఇష్టానుసారం వదిలేశాడని చెబుతున్నారు. దీనిపై హాస్టల్ వార్డన్ మోహన్‌ను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా యవ్వనంలో ఇవన్నీ మామూలేనని, అయినా విద్యార్థికి రక్తం ఏమైనా వచ్చిందా అని ఎదురు ప్రశ్నించారు.

బీసీడబ్ల్యూవో ఏమన్నారంటే...

కళాశాల హాస్టల్‌లో జరిగిన దాడి విషయమై పులివెందుల బీసీడబ్ల్యూవో జ్యోతిని ఆంధ్రజ్యోతి వివరణ కోరగా దాడి విషయం తన దృష్టికి రాలేదన్నారు. ఫిర్యాదు అందితే తప్పకుండా చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు.

గండికోట నుంచి 5000 క్యూసెక్కులు విడుదల

కొండాపురం, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): గండికోట ప్రాజెక్టు నుంచి మైలవరం జలాశయానికి శుక్రవారం రాత్రి నుంచి 5000 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఈఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. అదేవిధంగా ప్రాజెక్టులోకి జీఎన్ఎస్ఎస్ కాలువ ద్వారా 4700 క్యూసెక్కులు, చాగల్లు రిజర్వాయిర్ నుంచి పెన్నానది ద్వారా 500 క్యూసెక్కులు, చిత్రావతి నది ద్వారా 200 క్యూసెక్కులు, వరద నీరు మరో 100 క్యూసెక్కులు వచ్చి చేరుతున్నట్లు ఈఈ తెలిపారు. కాగా తాగునీటి అవసరాల దృష్ట్యా మరో 20 క్యూసెక్కుల నీరు వదులుతున్నామన్నారు. గండికోట ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 26.85 టీఎంసీలు కాగా ప్రస్తుతం 26.62 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ తెలిపారు.

పెన్నాలో 70వేల క్యూసెక్కుల వరదనీరు

చెన్నూరు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): చెన్నూరు వద్ద పెన్నానదిలో 70వేల క్యూసెక్కుల వరద నీరు ప్రవహిస్తుంది. నదిలో నీరు ఉధృతంగా ఉండడంతో ఎవరూ నదీ పరివాహక ప్రాంతాల్లోకి వెళ్లవద్దని, కార్తీక స్నానాల కోసం నదిలో దిగవద్దని తహసీల్దారు హెచ్చరించారు. అలాగే పెన్నానది తీరం వెంబడి నిత్యం వీఆర్వోలు, వీఆర్‌ఏలు కాపలాగా ఉండాలని అన్నారు.

విచారణ లేకుండా చర్యలు ఎలా తీసుకుంటారు

● ఇంటర్ ఆర్జేడీ కార్యాలయం ఎదుట సీనియర్ అసిస్టెంట్ నిరసన

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): తనపై వచ్చిన ఆరోపణలపై ఎటువంటి విచారణ చేయకుండా చర్యలు ఎలా తీసుకుంటారని తిరుపతి డీవీఈవో కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ మునిచంద్ర తెలిపారు. శుక్రవారం ఇంటర్మీడియట్ ఆర్జేడీ కార్యాలయం ఎదుట ఆయన నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై డీపీవో పలు మార్లు ఫిర్యాదు చేశారని, అయితే ఎటువంటి విచారణ చేయకుండా డిప్యూటేషన్‌పై బదిలీ చేశారన్నారు. తనకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తానని హెచ్చరించారు. దీనిపై ఆర్జేడీ సురేష్‌బాబును వివరణ కోరగా మునిచంద్రపై వచ్చిన ఆరోపణలపై విచారణ చేసి కమిషనర్‌కు పంపించడం జరిగిందన్నారు. అయితే కమిషనర్ ఆదేశాల మేరకే బదిలీ చేయడం జరిగిందన్నారు.

బాలుర ఆట స్థలంలో కిచెన్ షెడ్ నిర్మించవద్దు

● డీఈవో, డ్వామా పీడీ కమిటీకి స్థానికుల అభ్యంతరం



ఆటస్థలాన్ని పరిశీలిస్తున్న డీఈవో, పీడీ బృందం

వేంపల్లె, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): మండలానికి మంజూరైన సెంట్రలైజ్డ్ కిచెన్ షెడ్‌ను జిల్లా పరిషత్ బాలుర ఆటస్థలంలో నిర్మించవద్దని పూర్వ విద్యార్థులు, రాజకీయ నాయకులు డీఈవో షంషుద్దీన్, డ్వామా పీడీ విజయకుమార్ బృందానికి అభ్యంతరం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో చుట్టుపక్కల విద్యార్థులకు, పిల్లలకు ఆటస్థలం లేకుండా పోతుందని, కిచెన్ షెడ్ నిర్మాణాన్ని ఇతర ప్రాంతాలకు మార్చాలని విన్నవించారు. శుక్రవారం డీఈవో షంషుద్దీన్, పీడీ విజయ్‌కుమార్, ఎంఈవో స్టాలిన్, పంచాయతీరాజ్ డీఈ సుధాకర్‌రెడ్డి, ఇతర అధికారులు బాలుర ఆటస్థలాన్ని సందర్శించారు. అక్షయపాత్ర ఆధ్వర్యంలో మండలంలోని అన్ని పాఠశాలలకు మధ్యాహ్న భోజనాన్ని అందించే కిచెన్ షెడ్ నిర్మాణం కోసం స్థలాన్ని పరిశీలిస్తుండగా పలువురు ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు, టీడీపీ మండల కన్వీనర్ రామమునిరెడ్డి, దేవస్థాన మాజీ చైర్మన్ జయచంద్రారెడ్డి తదితరులు అధికారులతో మాట్లాడారు. విద్యార్థులకు, స్థానిక ప్రజలకు వ్యాయామానికి ఉపయోగపడుతోందని, కిచెన్ షెడ్ నిర్మాణంతో రాబోవు రోజుల్లో ఇబ్బంది వస్తుందని, తాళ్లపల్లె, లేదా పాములూరు హైస్కూలులో ఏర్పాటుచేస్తే అనువుగా ఉందని వివరించారు. ఇదే విషయాన్ని మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి ద్వారా కలెక్టర్‌కు విన్నవించినట్లు టీడీపీ మండల కన్వీనర్ రామమునిరెడ్డి తెలిపారు. ఈ విషయంపై కలెక్టర్‌తో మాట్లాడి తదుపరి చర్యలు తీసుకుంటామని డీఈవో, పీడీ తెలిపారు.

పుష్పగిరి ఆసుపత్రికి యూసీఐఎల్ వితరణ



చెక్కును అందజేస్తున్న యూసీఐఎల్ ప్రతినిధులు

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (యూసీఐఎల్) తమ సీఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా పుష్పగిరి విట్రియో రెటినా ఇన్‌స్టిట్యూట్ (పీవీఆర్ఐ)కు రూ.24.20లక్షలను అందజేసింది. ఈ మేరకు యూసీఐఎల్ జీఎం (మిల్) సుమన్ సర్కార్ శుక్రవారం పుష్పగిరి ఆసుపత్రి హెడ్ సూర్యప్రకాష్‌కు అందజేశారు. ఈ నిధులతో వైద్య పరికరాలు కొనుగోలు చేసి ప్రతి సంవత్సరం 5000 కంటే ఎక్కువ ఉచిత కంటి శస్త్రచికిత్సలు చేయనున్నట్లు పుష్పగిరి సంస్థ తెలిపింది. కార్యక్రమంలో డీజీఎం (పర్చేజ్) ఎస్‌కే బర్మన్, సీఎస్ఆర్ ఇన్‌చార్జి పాల్గొన్నారు.

పంచాయతీలకు స్టాంపు డ్యూటీ ఫీజులు చెల్లించడం లేదు

● మంత్రి పయ్యావులకు కొనిరెడ్డి శివచంద్రారెడ్డి వినతి

ప్రొద్దుటూరు, అక్టోబరు 31(ఆంధ్ర జ్యోతి): జిల్లాలోని పంచాయతీలకు రిజిస్ట్రేషను డిపార్టుమెంటు నుంచి స్టాంపుడ్యూటీ ఫీజులు చెల్లించడం లేదని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌కు సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు శివచంద్రారెడ్డి విన్నవించారు. శుక్రవారం మంత్రి కేశవ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రతి మూడు నెలలకు రావాల్సిన స్టాంపు డ్యూటీ సెప్టెంబరు 2023 నుంచి పంచాయతీలకు చెల్లించలేదని వివరించారు.



మంత్రి పయ్యావుల కేశవ్‌కు వినతి పత్రం అందజేస్తున్న శివచంద్రారెడ్డి

హౌస్ బిల్డింగ్ సొసైటీలో అవినీతిపై విచారణ

ప్రొద్దుటూరు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు హౌస్ బిల్డింగ్ సొసైటీలో జరిగిన అవినీతిపై సహకార శాఖ అధికారులు విచారణ చేపట్టారు. ఆమేరకు జిల్లా సహకార శాఖ అధికారులు వైఎంఆర్‌కాలనీలోని హౌస్‌బిల్డింగ్ సొసైటీ కార్యాలయంలో గత నెలలో రికార్డులు తనిఖీ చేశారు. ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ఫిర్యాదు మేరకు సహకార శాఖ అధికారులు విచారణ మొదలు పెట్టారు.హౌస్ బిల్డింగ్ సొసైటీ 1987లో థర్డ్ కాలనీ గా టూటౌన్‌బైపాస్ రోడ్డులో 460 ప్లాట్లు వేసి సొసైటీ సభ్యులకు కేటామించారు.గతంలో వీటిని కంతుల వంతున సొసైటీనుండి కొనుగోలు చేశారు.వీటని రిజిష్ట్రర్ చేయించుకోలేదు.నేడు ఆ స్థలాలకు భారీగా ధర పలుకుతుండటంతో వాటిని తమ పేరున తమ వారసుల పేరున రిజిష్టర్ చేయించు కుంటున్నారు. ఈ సొసైటీలో సభ్యులుగా వున్న వారికి సొసైటీకి ఎలాంటి డబ్బులు బాకీ లేమని ఎన్‌వోసీ ఇవ్వడానికి హౌస్ బిల్డింగ్ సొసైటీ పెద్దలు అధికారులు కలిసి అవినీతికి పాల్పడుతున్నట్లు ఫిర్యా దులు ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో సొసైటీ సభ్యులు కొందరు నాలుగు ప్లాట్లు ఇటీవల రిజిష్టర్ చేయించుకున్నారు. కానీ ఆ రిజిష్టర్‌చేయించుకుంది హౌస్‌బిల్డింగ్ సొసైటీ చైర్మన్ దార్యల భాస్కర్‌రెడ్డి బినామీలతో చేయించుకున్నట్లు ఫిర్యాదులు అందాయి. ఈ ఫిర్యాదుల మేరకు సహకార శాఖ అధికారి రామక్రిష్ణ విచారించినట్లుసమాచారం. దీనిపై ఇన్‌చార్జ్ కార్యదర్శి విష్ణువర్ధన్ వివరణ కోరగా నాలుగు ప్లాట్లు అక్రమంగా రిజిస్ట్రేషన్లు జరిగాయని ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ఫిర్యాదు చేశారని ఆ ఆమేరకు సెప్టెంబరు నెలలో విచారణ జరిగిందని కానీ ఎటువంటి అక్రమాలు జరగలేదని తెలిపారు.



దొంగ అరెస్టు

● బంగారు సరుదు, రెండు మోటారు బైకులు స్వాధీనం

పోరుమామిళ్ల, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): పరారీలో ఉన్న ప్రకాశం జిల్లా కొత్తపట్నం మండలం ఈతముక్కల గ్రామానికి చెందిన దర్శనాల ఏడుకొండలును అరెస్టు చేసి అతని నుంచి 35 గ్రాముల బంగారు సరుదు, గ్లామర్ హీరో, పల్సర్ బైకులను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ శ్రీనివాసులు, కలసపాడు ఎస్ఐ తిమోతి తెలిపారు. శుక్రవారం పోరుమామిళ్ల పోలీసుస్టేషన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ సమాచారం మేరకు శుక్రవారం మల్లకతవ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా మోటరు బైకులో గిద్దలూరు వైపు వెళుతున్న ఏడుకొండలును అదుపులోకి తీసుకుని అరెస్టు చేశామన్నారు. బంగారు తాళిబొట్టు సరుదు సుమారు 35 గ్రాములు, రెండు మోటారుబైకులను స్వాధీనం చేసుకున్నామని, నిందితుడిని కోర్టుకు హాజరుపరుస్తున్నట్లు వారు తెలిపారు.

సేవాశ్రమం సేవలు అభినందనీయం

కాశినాయన, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): ఓబులాపురం సమీపంలోని వివేకానంద సేవాశ్రమంలో అనాథలు, వృద్ధులకు అందిస్తున్న సేవలు అభినందనీయమని జిల్లా వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు కృష్ణకిషోర్ అన్నారు. శుక్రవారం కడప కలెక్టరేట్ ఆవరణంలో ఉన్న వయోవృద్ధుల సంక్షేమ కార్యాలయంలో వివేకానంద సేవాశ్రమం వ్యవస్థాపకుడు రామకృష్ణారెడ్డిని అభినందించారు. దీంతో ఆశ్రమం వాసులు, సంస్థ ఆత్మీయులు హర్షం వ్యక్తం చేశారు.

కేంద్ర, రాష్ట్ర సంక్షేమ పథకాల అమలులో ముందంజలో యూనియన్ బ్యాంకు

● 193మందికి రూ.31.50లక్షల పీఎం స్వానిధి నిధులు
● డ్వాక్రా సంఘాలకు రూ.1.5కోట్ల రుణాల పంపిణీ



మెగా చెక్కును అందిస్తున్న యూనియన్ బ్యాంక్ ఆర్ఎం లక్ష్మీతులసి

ఎర్రగుంట్ల, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టే సంక్షేమ అభివృద్ధి పథకాల అమలులో యూనియన్ బ్యాంకు ముందంజలో ఉందని ఆ బ్యాంకు కడప రీజినల్ హెడ్ లక్ష్మీతులసి తెలిపారు. శుక్రవారం ఎర్రగుంట్ల యూనియన్ బ్యాంకులో వీధి విక్రయదారులు 193మందికి రూ.31.50 లక్షలు, స్వయం సహాయక సంఘాలకు రూ.1.50కోట్ల రుణాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బ్యాంకు రుణాలను మహిళలు, ఖాతాదారులు సద్వినియోగం చేసుకుని ఆర్థిక పురోగతిని సాధించాలన్నారు. బ్యాంక్ ద్వారా తక్కువ ప్రీమియం ద్వారా గల ఇన్సూరెన్స్ పతకాలైన పీఎం సురక్షా భీమా, పీఎం జీవనజ్యోతి, భీమా ఇన్సూరెన్స్‌అతల్ పెన్షన్ పథకాల గురించి తెలిపారు. ఖాతాదారులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా సత్వర చర్యలు తీసుకుంటూ వారికి అన్ని విధాలా సహకరిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ పుల్లయ్య, బ్యాంకు మేనేజర్ సురేంద్ర, ఫీల్డావీసర్ శరత్, మెప్మా అధికారుల, మహిళలు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

ఎర్రగుంట్ల, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): స్థానిక ముద్దనూరు రోడ్డు స్వప్నా సందులో నివాసం ఉంటున్న అంకిరెడ్డిపల్లె రామదాసు(38) ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మద్యానికి అలవాటు పడ్డ రామదాసు తరచూ భార్య చంద్రకళతో గొడవ పడేవాడు. వీరికి ఇద్దరు కుమారులున్నారు. తరచూ గొడవపడుతుండడంతో కలత చెందిన భార్య ఇద్దరు కుమారులతో కలిసి గురువారం పుట్టింటికి వెళ్లింది. అదేరోజు రాత్రి ఇంట్లో ఒంటరిగా ఉన్న రామదాసు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. శుక్రవారం ఇంటివద్దకు వెళ్లగా తలుపులు వేసివున్నాయి. ఎంత పిలిపిచినా పలకకపోవడంతో తలుపులు తెరచి చూడగా రామదాసు ఉరి వేసుకుని వేలాడుతున్నాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి విచారిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

గోడ కూలి మహిళ మృతి

సీకేదిన్నె, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): గోడకూలి గాయాలపాలైన కోట్లూరి శివమ్మ (52) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు చింతకొమ్మదిన్నె పోలీసులు తెలిపారు. మండలంలోని కొప్పర్తి పంచాయతీ హరీంద్రనగర్‌కు చెందిన కోట్లూరు శివమ్మ ఉదయం 7 గంటల సమయంలో గోడకు తగిలించిన చొక్కాలో డబ్బులు తీసుకుని వస్తుండగా ప్రమాదవశాత్తు గోడ విరిగి శివమ్మ, ఆమె అత్త నారాయణమ్మపై పడడంతో ఇరువురికీ గాయాలయ్యాయి. స్థానికులు హుటాహుటిన కడప రిమ్స్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శివమ్మ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

జూదరుల అరెస్టు

వల్లూరు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తోళ్లగంగనపల్లె గ్రామ శివారులోని ముళ్లపొదల్లో జూదమాడుతున్నట్లు సమాచారం రావడంతో ఎస్ఐ పెద్ద ఓబన్న దాడులు నిర్వహించారు. ఈ దాడిలో ఆరుగురిని పట్టుకుని వారి వద్ద నుంచి రూ.12600 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. మండల పరిధిలో ఎక్కడైనా చట్టవ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు.

ఐక్యతకు నిదర్శనం బాబా మహోత్సవం



దర్గాలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న చమర్తి జగన్‌మోహన్‌రాజు

నందలూరు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : హిందూ ముస్లిం ఐక్యతకు నిదర్శనం మగ్దూం బాబా మహోత్సవమని టీడీపీ అసెంబ్లి ఇన్‌చార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజు అన్నారు. మండలంలోని నందలూరు గ్రామ పంచాయతీలో వెలసిన మగ్దూంబాబా ఉరుసు మహోత్సవంలో ఆయన శుక్రవారం పాల్గొన్నారు. టీడీపీ మైనార్టీ నాయకుడు ఆజం బాషా ఆధ్వర్యంలో చమర్తికి పూలచాందర్ సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈనేపథ్యంలో పీఠాధిపతి ఖైనుద్దీన్ హుస్సేన్ ను ఆయనను పూలమాలలు, శాలు వాత ఘనంగా సన్మానించారు. అనంతరం ఆజాం బాషా ఏర్పాటు చేసిన విందులో పాల్గొన్నారు.

స్వచ్ఛ గ్రామ పంచాయతీ లక్ష్యం

చిట్వేలి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ గ్రామ పంచాయతీ లక్ష్యం గా పనిచేయాలని ఉప సర్పంచ్ ఉమామహేశ్వర్‌రెడ్డి సూచించారు. తుఫాను వల్ల నిల్వ ఉన్న వర్షపునీటిని శుక్రవారం ఉమామహేశ్వర్‌రెడ్డి ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శి అధ్యక్షతన సిబ్బంది తొలగించారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

బహుమతి అందజేత

వీరబల్లి, అక్టోబరు31(ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా 'స్త్రీలు, చిన్నపిల్లలపై లైంగిక వేధింపులు-పరి రక్షించడంలో విద్యార్థుల పాత్ర' అనే అంశం పై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో పెద్దివీడు రెడ్డివారిపల్లె పాఠశాల విద్యార్థి సాయిభార్గవ్ జిల్లా స్థాయిలో మొదటిస్థానం సాధించారని హెచ్‌ఎం సుంకర శివయ్య తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆ విద్యార్థికి ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఆధ్వర్యంలో రూ.5 వేలు నగదు బహుమతి అందజేసినట్లు ఆయన తెలిపారు.

రాజ్యాంగంపై వ్యాసరచన పోటీలు

సుండుపల్లె, అక్టోబరు31(ఆంధ్రజ్యోతి): స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు రాజ్యాంగంపై వ్యాసరచన, ఉపన్యాసం, క్విజ్ పోటీలను ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు నాగార్జున ఆధ్వర్యంలో సాంఘీ శాస్త్ర ఉపాధ్యాయుడు సంపతి వెంకట్రమణ మండల స్థాయి పోటీలను నిర్వహించారు. సుండుపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి పదవ తరగతి విద్యార్థిని గగన, మడితాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి ఉర్దూ కైనాథ్, రాయవరం ఉన్నత పాఠశాల నుంచి విక్రమ్‌లను ఎంపిక చేశారు. విజయ్ కుమార్, దేవలానాయక్, హరికుమార్, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా ఇందిరమ్మ వర్ధంతి

వీరబల్లి, అక్టోబరు31(ఆంధ్రజ్యోతి): దివంగత ప్రధాని ఇందిరాగాంధీ వర్ధంతని శుక్రవారం ఘనంగా నిర్వహించినట్లు ఏపీ కిసాన్ కాంగ్రెస్ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు దుగ్గనపల్లి సురేంద్రారెడ్డి తెలిపారు. ఈ మేరకు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టె, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు పంచిపెట్టారు.

బహుమతుల ప్రదానం

పుల్లంపేట, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : కొత్తపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏకలవ్య ఫౌండేషన్ ట్రస్టు ఆధ్వర్యంలో విద్యార్థులకు శుక్రవారం ప్రాజెక్టు వర్కుపై పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. హెచ్ ఎం ఆలీఅక్బర్ ఆధ్వర్యంలో విద్యార్థులు బహుమతులు సాధించారు.

ఒంటిమిట్టలో పోలీసుల త్రీకే రన్

ఒంటిమిట్ట, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : ఒంటిమిట్టలో పోలీసు అధికారులు త్రీకే రన్ నిర్వహించారు. పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఒంటిమిట్ట నుంచి సాలాబాదు గ్రామం వరకు పోలీసు అధి కారులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐ బాబు, ఎస్‌ఐ ప్రవణ్‌కుమార్‌రెడ్డి, చెరువు సంఘం అధ్యక్షుడు పాటూరు గంగిరెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సర్దార్ వల్లభాయ్ పటేల్‌ను ఆదర్శంగా తీసుకోవాలి





రాజంపేట: సర్దార్ వల్లభాయ్‌పటేల్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సాయిలోకేశ్.. రైల్వేకోడూరు: అనంతరాజుపేట ఉద్యాన కళాశాలలో..

రాజంపేట టౌన్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : సర్దార్ వల్లభాయ్ పటేల్‌ను ఆదర్శంగా తీసుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్ అన్నారు. శుక్రవారం సర్దార్ వల్లభాయ్‌పటేల్ జయంతిని ఘనంగా నిర్వహించారు. రాజంపేట బీజేపీ కార్యాలయంలో సాయిలోకేశ్ ఆధ్వర్యంలో వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. శ్రీశైల దేవస్థాన చైర్మన్ పోతుగుంట రమేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు. అలాగే అన్నమాచార్య విశ్వవిద్యాలయంలో యూనివర్సిటీ వైస్ చాన్సలర్ సాయిబాబారెడ్డి, ప్రిన్సిపాల్ ఎస్‌ఎంవీ నారాయణ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. యూనివర్సిటీ ఆవరణంలో మొక్కలు నాటారు.

జనసేన పార్టీ ఆధ్వర్యంలో...

రాజంపేట టౌన్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : సర్దార్ వల్లభాయ్ పటేల్‌ను ఆదర్శంగా తీసుకోవాలని జనసేన రాజంపేట పార్లమెంట్ ఇన్‌చార్జి యల్లటూరు శ్రీనివాస రాజు అన్నారు. వల్లభాయ్ పటేల్ 150వ జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. శుక్రవారం పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో సర్దార్ పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సర్దార్ పటేల్ జయంతిని జాతీయ ఐక్యత దినోత్సవంగా నిర్వహించడం గర్వకారణమన్నారు. ఆయన దేశ తొలి ఉప ప్రధానిగా, హోం మంత్రిగా పనిచేశారని గుర్తు చేశారు. మాజీ జడ్పీటీసీలు యల్లటూరు శివరామరాజు, షబ్బీర్ అహ్మద్, మాజీ సర్పంచ్ సమ్మెట శివప్రసాద్, అబూబకర్, వినోద్‌వర్మ, పెడకాల సుధాకర్ పాల్గొన్నారు.

రైల్వేకోడూరు: విద్యార్థులు వల్లభాయ్ పటేల్ అడుగు జాడల్లో నడవాలని అనంతరాజుపేట ఉద్యాన కళాశాల ఇన్‌చార్జ్ డీన్ ఎం. శివప్రసాద్ తెలిపారు. శుక్రవారం రైల్వేకోడూరు ఉద్యాన కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో ఏక్తాదివస్, ఏక్తామార్చ్ నిర్వహించి వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఓఎస్‌డీ డాక్టర్ ఎల్. ముకుందలక్ష్మి, ఎన్ ఎస్ఎస్ పీవోలు డాక్టర్ ఏ.నిశ్చల, డాక్టర్ కే. లలిత, డాక్టర్ బి. హరిమల్లికార్జునరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు. అలాగే రైల్వేకోడూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి. రమేష్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు.

పుల్లంపేట : దళవాయిపల్లె ఆదర్శ ప్రాథమిక పాఠశాల, పుల్లంపేటలోని సంస్కృత పాఠశాలలో జాతీయ ఐక్యత దినోత్సవం జరుపుకున్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు.

సుండుపల్లె: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆయన చిత్రపటం వద్ద ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు నాగార్జున నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోలీసు అమరవీరుల సేవలు మరువలేనివి

● ఏఎస్పీ మనోజ్ రామ్‌నాథ్‌హెగ్డే



రాజంపేట: కొవ్వుత్తుల ర్యాలీలో పాల్గొన్న ఏఎస్పీ మనోజ్‌రామ్‌నాథ్ హెగ్డే



రాయచోటిలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసు అధికారులు

రాజంపేట టౌన్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : పోలీసులు శాంతి భద్రతల పరిరక్షణ కోసం తమ ప్రాణాలు కూడా లెక్కచేయకుండా ఎంతోమంది అమరులయ్యారని వారి స్ఫూర్తిని గుర్తు చేసుకుంటూ అక్టోబరు 31న పోలీసుల అమర వీరుల దినోత్సవం నిర్వహిస్తున్నట్లు ఏఎస్పీ మనోజ్ రామ్‌నాధ్‌హెగ్డే తెలి పారు. శుక్రవారం పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని ఆర్‌అండ్‌బి బంగ్లా నుంచి ఆర్టీసీ బస్టాండ్ సర్కిల్ వరకు పోలీసులు విద్యార్థులతో కలిసి కొవ్వుత్తుల ర్యాలీ నిర్వహించారు. అనంతరం పోలీసులు అమరవీరులకు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ పోలీసులు విధుల నిర్వహణలో ప్రాణాలు తెగించి ఎంతోమంది అశువులు చెందారన్నారు.

రాయచోటిటౌన్: పోలీసు అమరవీరుల వారోత్సవాల ముగింపు సందర్భంగా శుక్రవారం రాత్రి జిల్లా అదనపు ఎస్పీ ఎం. వెంకటాద్రి ఆధ్వర్యంలో విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన పోలీసు అమరవీరులకు కొవ్వొత్తుల ప్రదర్శనతో నివాళులర్పించారు. ఏఆర్ డీఎస్పీ ఎం. శ్రీనివాసులు, పట్టణ సీఐ బీవీ చలపతి, ఆర్‌ఎస్‌ఐలు, పోలీసు సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

రక్తదానం చేయండి ప్రాణదాతలు కండి :కమాండెంట్

సిద్దవటం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని 11వ పోలీసు పటాలయం కమాం డెంట్ కె.ఆనందరెడ్డి తెలిపారు. పోలీసు అమరవీరుల వారో త్సవాల్లో భాగంగా బెటాలియన్‌లోని క ల్యాణ మండపంలో బ్లడ్ డొనేషన్ క్యాంపు, ఉచిత మెగా మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ నవీద్ అహ్మద్, డాక్టర్ రామనాథం, డాక్టర్ జయప్రకాష్, డాక్టర్ ప్రభంజన్, డాక్టర్ శ్రావికలు హాజరై వారి సేవలను అందించారు.

హామీని నిలబెట్టుకోవాలి

రాయచోటిటౌన్, అక్టోబరు31(ఆంధ్రజ్యోతి): రాయచోటికి ఎట్టి పరిస్థితుల్లో అన్యాయం జరగదని సీఎం చంద్రబాబునాయుడు 2024 రాయచోటి ఎన్నికల బహిరంగ సభలో ప్రజలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని రాయచోటి మండల లీగల్ సర్వీసెస్ కమిటీ మాజీ సభ్యుడు యర్రపురెడ్డి విశ్వనాథరెడ్డి శుక్రవారం ఒక ప్రకటన ద్వారా విజ్ఞప్తి చేశారు. అన్నమయ్య జిల్లా కేంద్రంగా రాయచోటినే కొన సాగించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

హక్కుల కోసం ఐక్యంగా పోరాడుదాం: ఏఐటీయూసీ



ఓబులవారిపల్లె: ఏఐటీయూసీ జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో నాయకులు



రాజంపేట: మాట్లాడుతున్న సీపీఐ నాయకుడు మహేష్



ఏఐటీయూసీ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

● ఘనంగా ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవం

రైల్వేకోడూరు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): కార్మికుల హక్కుల కోసం ఐక్యంగా పోడాడుదాం అని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు గంగాధర్ పిలుపునిచ్చారు. శుక్రవారం రైల్వేకోడూరు నియోజకవర్గంలో ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ఎండగట్టేలా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. సీనియర్ నాయకులు తుమ్మల రాధాక్రిష్ణయ్య, సీపీఐ ఏరియా కార్యదర్శి జ్యోతి చిన్నయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పందుగోల మణి, యువ నాయకుడు తుమ్మల క్రిష్ణచైతన్య, మండల కార్యదర్శి దార్ల రాజశేఖర్, మండల సహాయ కార్యదర్శి గంగాపూరి తేజ పాల్గొన్నారు.

ఓబులవారిపల్లె: ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను శుక్ర వారం మంగంపేటలోని ఏపీఎండీసీ పరిపాలన భవనం వద్ద కార్మిక సంఘాల నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మంగంపేట త్రివేణి వర్కర్స్ యూనియన్ ఉద్యోగులు, ఏపీఎండీసీ ఉద్యోగులు, సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు, ట్రేడ్ యూనియన్, సీపీఐ నాయకుల ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భం గా మాట్లాడుతూ మంగంపేట బ్రాంచ్‌లో గ్రేడింగ్ రాయి లేదని ప్రచారాలు సాగుతున్నాయన్నారు. దీంతో కార్మికుల పరిస్థితి ఏమిటని, దీనిపై పోరాటం చేయాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. అనంతరం ఏఐటీయూసీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు మాదరాజు గంగాధర్, పోకూరి మురళి మాట్లాడారు.

పోరాటాలతో పాలకులకు బుద్ధి చెబుదాం

రాయచోటిటౌన్, అక్టోబరు31(ఆంధ్రజ్యోతి): కార్మికుల సంక్షేమాన్ని విస్మరించిన పాలకులకు పోరాటాలతో బుద్ధి చెబుదామని ఏఐటీ యూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సిద్దిగాళ్ల శ్రీనివాసులు, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కోకన్వీనర్ నేలపాటి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా శుక్రవారం మున్సిపల్ కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మా ట్లాడుతూ నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక హ క్కులను కాలరాస్తున్నాయని, పోరాడి సాధించు కుందామన్నారు. ఏఐటీయూసీ రాయచోటి నియోజ కవర్గ కార్యదర్శి బత్తల వెంకట్రమణ, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి, ఏఐ వైఎఫ్ జిల్లా కార్యదర్శి జక్కల వెంకటేశ్, ఆర్టీసీ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గజపతి, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కేశవ రావు, శేషాద్రిబాబు, హరిప్రసాద్ పాల్గొన్నారు.

రాజంపేట డివిజన్ రెవెన్యూ అసోసియేషన్ ఎన్నికలు ఏకగ్రీవం



ప్రమాణ స్వీకారం చేస్తున్న డివిజన్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

రాజంపేట, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట డివిజనల్ రెవెన్యూ అసోసియేషన్ ఎన్నికలు ఏకగ్రీవంగా నిర్వహించారు. అధ్యక్షుడిగా రాజంపేట సబ్‌కలెక్టర్ కార్యాలయంలో పనిచేసే ఏవో బి.శ్రీధర్‌రావు ఎన్నికయ్యారు. అసోసియేట్ అధ్యక్షుడిగా పుల్లంపేట తహసీల్దారు వి.పుల్లారెడ్డి ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా వీరబల్లె తహసీల్దారు కె.ఖాజాబీ, రాజంపేట తహసీల్దారు ఎస్.పీర్‌మున్ని, ఎస్. అల్లాబకస్, ప్రధాన కార్యదర్శిగా కోడూరు ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ డి.శ్రీనివాసులు ఎన్ని కయ్యారు. జాయింట్ సెక్రటరిగా జి.సుశీల్ కుమార్, యు.నిఖిల్, జి..అశోక్ కుమార్, సభ్యులుగా సాయి, రమ్య, నవీన్, ట్రెజరర్‌గా విజయకృష్ణలు ఎన్నికయ్యారు. జిల్లా రెవెన్యూ అసోసియేషన్ అధ్యక్షుడు నరసింహకుమార్, ప్రధాన కార్యదర్శి బాబ్జీ, ఎన్నికల అదికారి ఫణికృష్ణ, మోహన్‌కృష్ణ, కిరణ్, సునీల్‌లు పాల్గొన్నారు.

నిత్యపూజకోనకు బస్సు ఏర్పాటు చేయాలి

సిద్దవటం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన నిత్యపూజేశ్వరకోనకు బస్సు సౌకర్యం ఏర్పాటు చేయాలని ఎండోమెంట్ ఈవో శ్రీధర్ శుక్రవారం కడపలో ఆర్టీసీ రీజనల్ మేనేజర్‌కు వినతిపత్రం సమర్పించారు. నిత్యపూజేశ్వరకోన ఇన్‌చార్జి ఈవో శ్రీధర్ మాట్లాడుతూ భక్తులకు ఆర్టీసీ బస్సు సౌకర్యం ఏర్పాటు చేయాలని ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు.

పేదలకు అండగా సీఎం సహాయ నిధి



చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అరవ శ్రీధర్

చిట్వేలి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే అరవ శ్రీధర్, ముక్కా రూపానందరెడ్డి సతీమణి వరలక్ష్మి అన్నారు. శుక్రవారం వారు బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. చిట్వేలి దళితవాడకు చెందిన సింగనమల సుబ్రమణ్యంకు రూ.14 వేలు, మైలపల్లె గొల్లపల్లెకు చెందిన నంద్యాల శ్రీనివాసులరెడ్డికి రూ.1,18,881, పోళ్లోపల్లి పంచాయతీ బోయపల్లికి చెందిన జెల్లి సుజాతకు రూ.4.5 లక్షలు, అలాగే గట్టుమీదపల్లికి చెందిన తుపాకుల నాగభూషణంకు రూ.68,987 చెక్కులను వారి స్వగృహాల్లో అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏదోటి రాజశేఖర్, మాదాసు నరసింహ, శివరాజు, మన్మధ, మహేష్, నాయకులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు

రామాపురం, అక్టోబరు31(ఆంధ్రజ్యోతి): మండలంలోని నీలకంట్రావుపేట ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఎయిడ్స్‌పై ప్రజా చైతన్య సేవా సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఓఆర్‌డబ్ల్యూ విజయలక్ష్మి మాట్లాడుతూ హెచ్‌ఐవీ నివారణ చర్యల గురించి విద్యార్థులకు వివరించారు. ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వనజారెడ్డి, పీఈటీ తెలుగు పండిట్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రమాదేవి

రైల్వేకోడూరు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ కార్యకర్తల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని అంగన్వాడీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజులు, రైల్వేకోడూరు అధ్యక్షురాలు రమాదేవి డిమాండ్ చేశారు.శుక్రవారం రైల్వేకోడూరులోని వెలుగు కార్యాలయంలో నూతన కార్యవర్గ సమావేశం నిర్వహించారు. అనంతరం నూతన కమిటీని ఏర్పాటు చేశారు. అధ్యక్షురాలిగా రమాదేవి, ప్రధాన కార్యదర్శిగా శ్రీలక్ష్మి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రాధాకుమారి, కోశాధికారి గా పద్మావతి, సహాయ కార్యదర్శిగా వనజలను ఎన్నుకున్నారు.

భూసార పరీక్షపై విద్యార్థులకు శిక్షణ

ఒంటిమిట్ట, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): భూసార పరీక్ష ప్రాముఖ్యతపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చినట్లు టెస్టింగ్ ల్యాబ్ ఏవో సాయిజ్యోతి తెలిపారు. శుక్రవారం స్థానిక ఉన్నత పాఠశాలలో జిల్లా సాయిల్ టెస్టింగ్ ల్యాబ్ ఆధ్వర్యంలో స్కూల్ సాయల్ హెల్త్ ప్రోగ్రాంపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ భూసార పరీక్షల ప్రాముఖ్యత, మట్టి నమూనాల సేకరణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు వివరించామన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవీంద్రకుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉద్యోగికి ఉత్తమ సేవలతోనే గుర్తింపు

పుల్లంపేట, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : ఉత్తమ సేవలతోనే మంచి గుర్తింపు లభిస్తుందని డీఎస్‌డబ్ల్యూవో దామోదర్‌రెడ్డి అన్నారు. శుక్ర వారం ఏఎస్‌డబ్ల్యూ శ్రీనివాసమూర్తి పదవీ విరమణ సందర్భంగా పుల్లంపేటలోని కమ్యూనిటీ హాస్టల్లో ఆయన్ను సన్మానించారు. శ్రీనివాసమూర్తి 39 సంవత్సరాలుగా సేవలు అందించారన్నారు. రిటైర్డ్ డీఎస్‌డబ్ల్యూవోలు జయప్రకాష్, శివగంగ, ప్రసాద్, రాజంపేట, రైల్వేకోడూరు హాస్టళ్ల వార్డెన్లు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం

లక్కిరెడ్డిపల్లె, అక్టోబరు31(ఆంధ్రజ్యోతి): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే రోగాలు దూరమవుతాయిన మలేరియా సబ్ యూనిట్ అధికారి జయరామయ్య అన్నారు. శుక్రవారం దిన్నెపాడు గ్రామంలోని నరసింహరాజుగారిపల్లె, బెస్తపల్లి, పర్వతిరెడ్డిగారిపల్లెలలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్యదర్శి ప్రతి గ్రామంలోనూ బ్లీచింగ్ పౌడర్ చల్లించాలన్నారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రేడే నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో రవీంద్ర, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఎంఎల్‌హెచ్‌పీ వెంకట్రమణ, ఆరోగ్య కార్యకర్తలు ఓబులేసు, ఎంసీ రెడ్డెమ్మ, రాధమ్మ, శైలజ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

సమష్టి పోరాటాలతో సమస్యల పరిష్కారం

● మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి

రాయచోటి(నేతాజీ సర్కిల్), అక్టోబరు31(ఆంధ్రజ్యోతి): సమష్టి పోరాటాలతో సమస్యల పరిష్కారం సాధ్యమని మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సంబేపల్లి మండలం గుట్టపల్లి, ఎస్. సోమవరం, దేవపట్ల, రెడ్డివారిపల్లె, నాగిరెడ్డిగారిపల్లె గ్రామాల్లో కోటి సంతకాల సేకరణ, రచ్చబండ కార్యక్రమాలకు ఆయన హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ మెడికల్ కాలేజీలు ప్రైవేటుపరం చేయకుండా పోరా డుదామన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

ఓబులవారిపల్లె, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : మహిళలు ఆర్థికంగా ఎదగాలని ఏపీఎం ఏరియా కోఆర్డినేటర్ మల్లికార్జునరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్‌హెచ్‌జీ స్త్రీనిధి, ఉన్నతి రుణాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఎంఈజీపీ, పీఎంఎఫ్‌ఎ, ఎంఎస్‌ఎంఈ పథకాల ద్వారా రుణాలు పొందాలని పేర్కొన్నారు. మండల సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు, సీసీలు దామోదర్, గోవిందమ్మ, శివయ్య పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయాలి : సీఐటీయూ

రాజంపేట టౌన్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి):ఒంగోలు సీఐటీయూ ఆధ్వర్యంలో ఈనెల 15, 16 తేదీల్లో జరిగే మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రవి కుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల సమస్యల మీద ప్రతి యేడాది రాజీలేని పోరాటాలు చేస్తోందన్నారు.

రోడ్డు విస్తరణ పనులు ఎందుకు చేపట్టలేదు

రాజంపేట, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : కడప - రేణిగుంట జాతీయ రహదారి మంజూరై రెండేళ్లు కావస్తున్నా ఎందుకు పనులు చేపట్టలేదని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్.తులసిరెడ్డి ప్రశ్నించారు. శుక్రవారం రాజంపేటలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం కడప - రేణిగుంట డబల్‌లైన్‌లో వేలాది వాహనాలు రద్దీ పెరిగిపోయి ప్రతిరోజు రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, త్వరగా పనులు చేపట్టాలన్నారు.

కాలుష్యం కోరల్లో రైల్వే కోడూరు

● ఇబ్బందులు పడుతున్న ప్రజలు ● అలర్జీలు, శ్వాసకోశ వ్యాధులతో ఆస్పత్రులపాలు

నిరంతరం వేలాది వాహనాల రద్దీ.. పల్వరైజింగ్ మిల్లులకు బెరైటీస్ ఖనిజం, అక్కడి నుంచి రైల్వే స్టేషను వద్దకు పౌడర్‌ను చేరవేసే లారీలు, టిప్పర్లతోపాటు, ఉద్యాన ఉత్పత్తులను తరలించేందుకు ఇతర ప్రాంతాల నుంచి వచ్చి వెళ్లే వాహనాలు రైల్వే కోడూరు పట్టణంలో వాయుకాలుష్యానికి కారణమవుతున్నాయి. దీంతో శ్వాసకోశ సంబంధిత వ్యాధుల బారిన పడి సతమతమవుతున్నామని పట్టణ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని అధికారులను, పాలకులను కోరుకుంటున్నారు.

రైల్వేకోడూరు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): రైల్వే కోడూరు పట్టణానికి సమీపంలోనే ఏపీఎండీసీ ఆధ్వర్యంలో మంగంపేట బెరైటీస్ గనులున్నాయి. పట్టణానికి సమీపంలోని అయ్యవారిపల్లె వద్ద బెరైటీస్ పల్వరైజింగ్ మిల్లులు పని చేస్తున్నాయి. నియోజకవర్గం ఉద్యాన పంటలకు కేంద్రం కావడంతో ఆయా ఉత్పత్తులను తీసుకు వెళ్లడానికి దేశంలోని అన్ని ప్రాంతాల నుంచి వాహనాలు వస్తుంటాయి. తిరుపతికి వెళ్లేందుకు, సమీపంలోని చెన్నై పోర్టుకు వెళ్లే ప్రధానం మార్గంలో పట్టణం ఉండడంతో అందుకు సంబం ధించిన భారీ వాహనాలు సైతం ఈ మార్గంలో ఎక్కువగా వెళుతుం టాయి. ఈ నేపథ్యంలో పట్టణంలోని రోడ్లపై పెద్ద ఎత్తున దుమ్ము, ధూళి రేగుతోంది. ఫలితంగా శ్వాసకోశ వ్యాధులు, అలర్జీల బారిన పడుతున్నామని స్థానికులు అంటున్నారు. ఈ దుమ్ము ధూళి ఇళ్లలో చేరుతుండడంతో కనీసం రెండు గంటలకోసారి ఇంటిని శుభ్రం చేసుకోవాల్సి వస్తోందని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంగంపేట ఏపీఎండీసీకి వెళ్లే ప్రధాన మార్గంలో లారీలు, టిప్పర్లు వెళ్లినప్పుడు దుమ్ము విపరీతంగా రేగుతుండడంతో ఆ మార్గంలో వెళ్లేటపుడు ముక్కు, నోరు మూసుకోవాల్సి వస్తోందని ప్రయాణికులు చెబుతున్నారు. ఇక మంగంపేట మొత్తం దుమ్ము, ధూళితో నిండిపోతోంది. దీంతో . మంగంపేట, కాపుపల్లె తదితర ప్రాంతాల్లో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఈ దుమ్ము పీల్చిన వారికి ఆయాసం, చర్మంపై దద్దులు, దురదలు వస్తున్నాయని ప్రజలు ఫిర్యాదు చేస్తున్నారు. శాంతినగర్, మ్యాంగో మార్కెట్ యార్డు వరకు, బీఎస్ఎన్ఎల్ కార్యాలయం ఎదురుగా ప్రధానదారుల్లో దుమ్ము ప్రభావం ఎక్కువగా ఉంటోంది. ఇక వెంకయ్యస్వామి ఆలయం సమీపంలోని డంపింగ్ యార్డు దుర్వాసన వెదజల్లుతుంటుంది. ఇందులోని చెత్త చెదారాన్ని తరచూ కాలుస్తుండడంతో, ఆ పొగ ఇళ్లలోకి వచ్చి ఇబ్బంది పెడుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు.. ఇప్పటికైనా అధికారులు తగు చర్యలు తీసుకుని దుమ్ము, ధూళి రాకుండా చేయాలని ప్రజలు కోరుతున్నారు.



మంగంపేట సమీపంలో రేగుతున్న దుమ్ము



చిట్వేలి మార్గంలో రేగుతున్న దుమ్ము

అలర్జీలతో బాధపడుతున్నాం



దుమ్ము, ధూళితో అలర్జీలు, శ్వాసకోశ వ్యాధులతో ప్రజలు బాధపడుతున్నారు. రైల్వేకోడూరు ప్రధాన దారిలో ఈ సమస్య ఎక్కువగా ఉం ది. దీనిని అరికట్టకపోతే ప్రజలు మరిన్ని వ్యాధులతో బాధపడాల్సి వస్తుంది.అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలి.

- చెన్నంశెట్టి వెంకటరమణ, స్థానికుడు

దుమ్ము తట్టుకోలేకున్నాం



మంగంపేట వద్ద దుమ్ముతో ప్రజలు, ఇబ్బందులు పడుతున్నారు. టిప్పర్లు, పెద్ద, పెద్ద లారీలు, బస్సులు వెళ్లేప్పుడు విపరీతంగా దుమ్ము లేస్తోంది. మంగంపేట ఏపీఎండీసీకి వెళ్లే మార్గంలో దుమ్ము రేగితే రెండు నిమిషాలు ఊరిపి బిగబట్టాల్సి ఉంటోంది.

-సిద్ధిలింగం మురళీకృష్ణ, స్థానికుడు

స్థలం విషయమై దాడి.. కేసు నమోదు

నిమ్మనపల్లి అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): ఇంటి స్థలం విషయంలో ఓ వ్యక్తిపై దాడి చేసి గాయపరచాడన్న ఆరోపణలతో రెడ్డిశేఖర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ కొండయ్యగారిపల్లి పంచాయతీ మిట్టమీదపల్లి వాసి వెంకటరమణ అదే గ్రామానికి చెందిన రెడ్డిశేఖర్ మధ్య కొంత కాలంగా ఇంటి స్థలం విషయమై తగాదా ఉంది. వెంకటరమణ ఇంటికి వెళ్లే రోడ్డులో శుక్రవారం రెడ్డిశేఖర్ మట్టిని తోలించాడు. ఈ మట్టిని వెంకటరణ చదును చేసుకుంటుండగా రెడ్డిశేఖర్ వచ్చి తన మట్టిని చదును చేయవద్దని గొడవకు దిగడంతోపాటు విచక్షణా రహితంగా కొట్టి గాయపరిచాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వడ్డీ వ్యాపారి దాడి.. ఒకరికి గాయాలు

మదనపల్లె అర్బన్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): వడ్డి వ్యాపారి దాడిలో ఓ వ్యక్తి గాయపడ్డాడు. మదనపల్లె మండలం ఇసుకనూతనపల్లెకు చెందిన శ్రీనివాసులు, ప్రభావతి దంపతులు రవి అనే వ్యక్తితో కొంత మొత్తం అప్పుగా తీసుకున్నారు. ఇందుకు సంబంధించి న వడ్డీ విషయమై గురువారం రాత్రి రవి ప్రభావతిని ప్రశ్నించాడు. దీంతో అవమానంగా భావించిన ఆమె వెంటనే క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. స్థానికులు ఆమెను మదనపల్లె ఆస్పత్రికి తరలించారు. ఈ విషయమై శుక్రవారం ఉదయం శ్రీనివాసులు రవిని ప్రశ్నించగా ఆగ్రహానికి గురైన అతను అక్కడే ఉన్న కర్రతో దాడి చేశాడు. దీంతో గాయపడిన ఆయనను వెంటనే మదనపల్లె ఆస్పత్రికి తరలించగా తిరుపతికి రెఫర్ చేశారు. కేసు విచారణ చేస్తున్నట్లు తాలూకా పోలీసులు తెలిపారు.

గురుకుల పాఠశాల విద్యార్థి అదృశ్యం



చరణ్

తంబళ్లపల్లె, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎస్టీ బాలుర గిరిజన గురుకుల పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థి జే. చరణ్(14) శుక్రవారం తెల్లవారుజామున అదృశ్యమయ్యాడు. వివరాల మేరకు.. మదనపల్లె మండలం చీకలబైలుకు చెందిన శివ కుమారుడు జే.చరణ్ ఎస్టీ గిరిజన గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. శుక్రవారం తెల్లవారుజామున చదువుకోవడానికి హాస్టల్ సిబ్బంది విద్యార్థులను నిద్ర లేపారు. ఆ తర్వాత బాత్రూంకు వెళ్లొస్తానని చెప్పి.. హాస్టల్ ప్రహరీగోడ దూకి పారిపోయాడు. కొద్ది సేపటికి గమనించిన సిబ్బంది తల్లితండ్రులకు సమాచారం అందిం చారు. ఈ విషయంపై తండ్రి శివ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ ఉమామహేశ్వర్‌రెడ్డి హాస్టల్‌కు చేరుకుని ఆరా తీశారు. హాస్టల్‌తోపాటు, తంబళ్లపల్లె, మదనపల్లె రోడ్డులో పలు చోట్ల ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించారు. బాలుడు తంబళ్లపల్లె నుంచి మదనపల్లె వైపు నడుచుకుని వెళ్తున్నట్లు ఓ సీసీ కెమెరాలో రికార్డు అయిన దృశ్యాలను పోలీసులు గుర్తించారు. బాలుడు ఎక్కడైనా కనిపిస్తే తంబళ్లపల్లె పోలీసులకు కాని, హాస్టల్ సిబ్బందికి కాని సమాచారం అందించాలని ఎస్ఐ తెలిపారు. కాగా, అదృశ్యమైన బాలుడు గురువారం రోజు రాత్రి హాస్టల్‌లో తోటి స్నేహితుడితో గొడవ పడినట్లు తెలిసింది. టీచర్లు మందలిస్తారనే భయంతో పారిపోయినట్లు చెబుతున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఉమామహేశ్వర్‌రెడ్డి తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరి మృతి

రామాపురం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. లక్కిరెడ్డిపల్లె సీఐ కొండారెడ్డి కథనం మేరకు.. రాయచోటి రింగు రోడ్డు పరిధిలో ఉన్న ఓ హోటల్‌లో హరీఫ్(40) అనే వ్యక్తి పనిచేస్తుండేవాడు. శుక్రవారం రాత్రి మద్యం సేవించి కాలినడకన వెళుతుండగా బండపల్లె పంచాయతీ భారత్ పెట్రోలు బంకు సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దీంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటనా స్థలాన్ని సీఐ కొండారెడ్డి పరిశీలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. మృతదేహాన్ని లక్కిరెడ్డిపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పరిశోధనలపై ఆసక్తి పెంచుకోవాలి

● ప్రొఫెసర్ బిందు మాధవరెడ్డి

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశలో పరిశోధనలపై ఆసక్తిని పెంచుకోవాలని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ అనిమల్ బయాలజీ శాఖ ప్రొఫెసర్ బిందుమాధవరెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన యోగివేమన విశ్వవిద్యాలయంలో స్కాలర్లకు విద్యార్థులకు డయాబెటిస్, కేన్సర్‌లో శక్తి సమతుల్యత (ఎనర్జీ హోమియోస్టాసిస్ ఇన్ డయాబెటిస్ అండ్ కేన్సర్) అనే అంశంపై అతిథి ఉపన్యాసం ఇచ్చారు. కేన్సర్ డయాబెటిస్‌పై ప్రస్తుతం జరుగుతున్న పరిశోధనలపై అవగాహనకల్పించారు. యువ పరిశోధకుల భాగస్వామ్యం గురించి ప్రస్తావించారు. యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ నుంచి వచ్చిన మరో ప్రొఫెసర్ రాజమోహన్‌రాయ్ యువత పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు అవసరమైన ఆలోచన విధానం, లక్షణాలపై అవగాహన కల్పించారు. విద్యార్థుల సందేహ నివృత్తి చేశారు. వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బెల్లంకొండ రాజశేఖర్, ప్రొఫెసర్ బిందు మాధవరెడ్డిని, ప్రొఫెసర్ రాజమోహన్‌రాయ్‌లను విశ్వవిద్యాలయం తరఫున సత్కరించారు.

అమరవీరుల కుటుంబాలకు అండగా నిలుద్దాం..

● ఎస్పీ ధీరజ్ కునుబిల్లి

రాయచోటిటౌన్, అక్టోబరు31(ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరులను స్మరించుకోవడంతో పాటు వారి కుటుంబాలకు అండగా నిలబడదామని అన్నమయ్య జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి పిలుపునిచ్చారు. అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా జిల్లా వ్యాప్తంగా విద్యార్థులు, పోలీసు పిల్లలు, పోలీసులకు నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి శుక్రవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఆయన ప్రశంసా పత్రాలతో పాటు నగదు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ విద్యార్థులు చదువుపై శ్రద్ధ వహించాలని సూచించారు. భవిష్యత్తులో పోటీ పరీక్షల్లో విజయం సాధించే దిశగా కృషి చేయాలన్నారు. విజేతలైన విద్యార్థులు తమ తల్లిదండ్రులకు మంచి పేరు ప్రఖ్యాతలు తెచ్చిపెట్టే విధంగా ప్రవర్తించాలని ఆకాంక్షించారు. పోలీసు సిబ్బంది తమ వృత్తిలో మరింత నైపుణ్యం, అంకితభావం చూపాలని దిశానిర్దేశం చేశారు. అనంతరం వ్యాసరచన పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులు ఎస్. సాయిభార్గవ్, కే. యశిత,సాయిహర్షిణి, వక్తృత్వ పోటీ విజేతలు ఎం. భవ్యశ్రీ, ఎం. విజయలక్ష్మి, ఎస్. సుభాన్, వ్యాసరచన పోటీ విజేతలుగా నిలిచిన పోలీసు పిల్లలు ఎం. సంధ్యారాణి, ఆర్. వర్షిణి, కే. జాహ్నవి, వక్తృత్వ పోటీల్లో విజేతలుగా నిలిచిన ఆర్. వర్షిణి, ఆర్. భవ్యశ్రీ, ఏ. గవల్ , వ్యాసరచన పోటీల్లో విజయాలు సాధించిన పోలీసు అధికారులు కే. మెహరాజ్ (ఉమెన్ పీసీ), బీ. బాలకృష్ణ (ఎస్ఐ), కే. శ్రీనాథ (పీసీ), వక్తృత్వ పోటీల్లో విజేతలు షేక్. మెహరాజ్ (ఉమెన్ పీసీ), బీ. బాలకృష్ణ (ఎస్ఐ), ఏ. సురేఖ (ఉమెన్ పీసీ)లకు మొదటి బహుమతి కింద రూ.5 వేలు, రెండవ బహుమతి రూ.3 వేలు, మూడవ బహుమతి రూ.2 వేలు చొప్పున నగదు బహుమతులతో పాటు ప్రశంసా పత్రాలను అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ వెంకటాద్రి, ఏఆర్ డీఎస్పీ ఎం. శ్రీనివాసులు, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, పోలీసు సిబ్బంది, అధ్యాపకులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.



వ్యాసరచన, వక్తృత్వ పోటీ విజేతలతో ఎస్పీ ధీరజ్ కునుబిల్లి, అదనపు ఎస్పీ వెంకటాద్రి

రెవెన్యూ డివిజన్ డిమాండ్‌కు పెరిగిన మద్దతు

పీలేరు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): పీలేరును రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ప్రకటించాలన్న డిమాండుకు పీలేరులో మద్దతు పెరుగుతోంది. రెవెన్యూ డివిజన్ సాధన సమితి ఆధ్వర్యంలో శుక్రవారం రెండో రోజు రిలే నిరాహార దీక్షలు కొనసాగాయి. వైసీపీ, ఎన్ఎస్‌యూఐ, స్థానిక ముస్లిం జమాయత్ మద్దతు ప్రకటించాయి. స్థానిక జామియా మసీదు ముతవల్లి అల్లావుద్దీన్ మాట్లాడుతూ అనాదిగా పీలేరుకు అన్యాయం జరుగు తోందని, నూతన జిల్లాల ఏర్పాటు సందర్భంగానైనా న్యాయం చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. స్వయం అభివృద్ధి చెందిన పీలేరుకు ప్రభుత్వ అండ లభిస్తే మరింత అభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. వైసీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి చక్రధర్ మాట్లాడుతూ పీలేరు ప్రాంత ప్రజల మనోభావాలను గౌరవిస్తూ పీలేరులో రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలన్నారు. ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అమృతతేజ మాట్లాడుతూ పాలనా సౌలభ్యం కోసం నూతన జిల్లాల ఏర్పాటు, పాత జిల్లాల విభజన చేస్తున్న ప్రభుత్వం అదే మాటకు కట్టుబడి పీలేరును రెవెన్యూ డివిజన్ చేయాలన్నారు. అనంతరం ముస్లిం జమాయత్ సభ్యులు తహసీల్దారుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సాధన సమితి సభ్యులు సుధాకర్, భాను, పాలకుంట శ్రీనివాసులు, ముతవల్లీలు సైపుల్లా, రియాజ్, షౌకత్ అలీ, తమీమ్, రఫీ, ఇబ్రహీం, తదితరులు పాల్గొన్నారు.



రిలే దీక్షలకు సంఘీభావం తెలుపుతున్న ముస్లిం జమాయత్ సభ్యులు

అవినీతి రహితంగా ఉపాధి హామీ పనులు

● జిల్లా నీటి యాజమాన్య సంస్థ సంచాలకుడు వెంకటరత్నం

రైల్వేకోడూరు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ఉపాధి పనులు అవినీతి రహితంగా జరగాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ సంచాలకులు వెంకటరత్నం తెలిపారు. శుక్రవారం రైల్వేకోడూరు మండల పరిషత్ సభాభవనంలో కోడూరు, ఓబులవారిపల్లె, చిట్వేలి మండలాలకు చెందిన ఉపాధి హామీ పథకం సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈకేవైసీ కార్యక్రమాన్ని వంద శాతం పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వం, ప్రైవేటు రంగాలు కలసి అవినీతిని కలసికట్టుగా నిర్మూలించాలన్నారు. జాబ్‌కార్డుల వందశాతం ఈకేవైసీ ద్వారా జవాబుదారీతనంతో ఉపాధి పథకాన్ని నిర్వహించవచ్చునని తెలిపారు. పండ్ల తోటల పెంపకానికి లబ్దిదారులను గుర్తించాలని అధికారులను ఆదేశించారు. పండ్ల తోటలను నాటి వాటిని పోషించుకునేందుకు రైతులకు అవకాశం కల్పించాలన్నారు. కాటిల్ షెడ్లు, సోక్ పిట్స్, నీటి కుంటలు, సామూహిక తోటల పెంపకం, రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటే కార్యక్రమాలను ముమ్మరంగా చేపట్టాలన్నారు. రైతాంగానికి ఎక్కువగా ఉపయోగపడే పనులను గుర్తించి నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాజంపేట అసిస్టెంట్ సంచాలకులు సన్నపునేని మృత్యుంజయరావు, ఎంపీడీవో నాగిరెడ్డి, కోడూరు, ఓబులవారిపల్లె, చిట్వేలి మండలాల ఏపీవోలు, టెక్నికల్ అసిస్టెంట్లు, క్షేత్రసహాయకులు తదితరులు పాల్గొన్నారు.

రాజంపేట : రాజంపేట మండల పరిషత్ సభాభవనంలో రాజంపేట, నందలూరు, పుల్లంపేట, పెనగలూరు మండలాల ఉపాధి హామీ సిబ్బందితో పీడీ సమీక్ష నిర్వహిం చారు. . ఈ కార్యక్రమంలో నరసింహమూర్తి, డీఎల్డీవో, రాజంపేట అసిస్టెంట్ పథక సంచాలకులు ఏపీడీ, రాజంపేట క్లస్టర్ సన్నపనేని మృత్యంజయరావు, స్థానిక ఎంపీడీవో వరప్రసాద్, నందలూరు, పెనగలూరు ఎంపీడీవోలు ప్రసాద్, విజయరావు, ఏపీవోలు, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్‌లు తదితరులు పాల్గొన్నారు.



సమావేశం లో మాట్లాడుతున్న జిల్లా ఉపాధి సంచాలకుడు వెంకటరత్నం

చిత్తూరు రోడ్డుకు మరమ్మతులు

పీలేరు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): పీలేరు-చిత్తూరు మార్గంలోని రైల్వే గేటు వద్ద బురదమయమైన రోడ్డుకు ఆర్వోబీ కాంట్రాక్టు సంస్థ శుక్రవారం తాత్కాలిక మరమ్మతులు చేసింది. పీలేరు -చిత్తూరు, పీలేరు-మదనపల్లె మార్గాల్లో ఆలస్యంగా సాగుతున్న ఆర్వోబీల నిర్మాణ పనుల కారణంగా ప్రజలు పడుతున్న ఇబ్బందులను ప్రతిబింబిస్తూ ఆంధ్రజ్యోతిలో శుక్రవారం 'జారుడు బండలో జారినట్టే...!' అన్న కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఆ కథనంపై తహసీల్దారు శివకుమార్ స్పందించారు. వెంటనే చిత్తూరు మార్గంలో తాత్కాలికంగానైనా రోడ్డు ఏర్పాటు చేయాలని ఆర్వోబీ కాంట్రాక్టు సంస్థను ఆదేశించారు. దీంతో ఆ మార్గంలో శుక్రవారం ఉదయం రోడ్డు రోలరుతో మట్టి, కంకర తొక్కించి తాత్కాలిక రోడ్డు ఏర్పాటు చేశారు. దీంతో ఆ మార్గంలో వాహనాల రాకపోకలకు కాసింత అనువైన రోడ్డు ఏర్పాటైంది. పీలేరు-మదనపల్లె మార్గంలోని రోడ్డులో దుమ్ము రేగకుండా ట్యాంకర్లతో పలుదఫాలుగా నీటిని చల్లించారు. కేవలం తాత్కాలిక పనులకు పరిమితం కాకుండా ఆర్వోబీలను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని తహసీల్దారు కాంట్రాక్టు సంస్థ సిబ్బందిని ఆదేశించారు.



రోడ్డుకు మరమ్మతులు చేయడంతో సాఫీగా వెళుతున్న వాహనాలు

అయాన్‌కు అండగా నారా లోకేశ్!

బి.కొత్తకోట, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): కిడ్నీ సమస్యతో సతమతమవుతున్న బాలుడు అయాన్‌ను ఆదుకోవాలని టీడీపీ నేత నారా లోకేశ్ నిర్ణయించారు. బాలుడి వైద్యానికి కావాల్సిన అన్ని సదుపాయాలు కల్పించాలని తన టీంను ఆదేశించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. బి.కొత్తకోటకు చెందిన ఆటోడ్రైవర్ సమీవుల్లా, షమీ దంపతుల కుమారుడు అయాన్ ఇటీవల మిద్దెపై నుంచి ప్రమాదవశాత్తు కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. బాలుడిని ఆసుపత్రికి తరలించగా కిడ్నీలు దెబ్బతిన్నట్లు వైద్యులు నిర్ధారించారు. శక్తికి మించిన పని కావడంతో తమ బిడ్డ ప్రాణాలు కాపాడాలని సామాజిక మాధ్యమాల్లో ు కోరారు. ఈ విషయం నారా లోకేష్ దృష్టికి వెళ్లడంతో ఆయన స్పందించి మానవత్వం చాటుకున్నారు. ఆయాన్ కోలుకోవడానికి అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని ప్రకటించారు. బాలుడు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ విషయం బహిర్గతం కావడంతో బాలుడి తల్లితండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఉమ్మడి కడప జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ ఎంపికలు

రాయచోటిటౌన్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి కడప జిల్లా స్థాయి అండర్ -14, అండర్-17 బాలబాలికల విభాగాల్లో శుక్రవారం రాయచోటి పట్టణంలోని మాసాపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి, వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీకాంత్‌రెడ్డి, జగదీశ్వరయ్యల ఆధ్వర్యంలో సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ క్రీడల్లో ఎంపికలు నిర్వహించారు. ఈ ఎంపికలకు సుమారు 300 మందికిపైగా క్రీ డాకారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు మనోహర్‌బాబు మాట్లాడుతూ ఎంపికైన క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో పాల్గొని జిల్లా జట్టుగా మంచి ప్రతిభ కనపర్చి రాష్ట్ర స్థాయిలో మంచి ఫలితాలు సాధించాలని పిలుపునిచ్చారు. సాఫ్ట్‌బాల్ అండర్- 14, బాలుర విభాగంలో 16 మంది, బాలికల విభాగంలో 16 మంది, అండర్-17 బాలుర విభాగంలో 16 మంది, బాలికల విభాగంలో 16 మంది, బేస్‌బాల్‌లో అండర్-14 బాలుర విభాగంలో 16 మంది, బాలికల విభాగంలో 16 మంది, అండర్-17 బేస్‌బాల్‌లో బాలుర విభాగంలో 16 మంది, బాలికల విభాగంలో 16 మందిని ఎంపిక చేశారు. ఈ జట్లు నవంబర్‌లో పులివెందుల, నంద్యాల, చిత్తూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో జరగబోయే రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు మనోహర్‌రెడ్డి, లలితమ్మ, సుబ్రమణ్యం, వేణుమాధవ్‌రాజు, లలితమ్మ, సుబ్రమణ్యం, వేణుమాధవ్‌రాజు, రవీందర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీలకు ఎంపికలు: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణంలో ఉమ్మడి కడప జిల్లా స్థాయి కబడ్డీ పోటీలకు అండర్-17 విభాగంలో బాల, బాలికలకు జిల్లా స్థాయి ఎంపికలు నిర్వహించారు. 180 మంది క్రీడాకారులు పాల్గొన్నట్లు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరీ శ్రీకాంత్‌రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ వీరాంజనేయులు తెలిపారు. అండర్-17 విభాగంలో కబడ్డీ పోటీలకు జిల్లా స్థాయి ఎంపికలు ప్రశాంతంగా పూర్తి చేశారు. ఈ కార్యకంలో ప్రధానోపాధ్యాయులు త్రివేణి, స్కూల్ కమిటీ చైర్మన్ ఎజాజ్‌ఖాన్, యూసుఫ్‌అలీ, ఏపీ పీఈటీ అండ్ ఎస్‌ఏపీఈ అసోషియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రవీణ్‌కిరణ్, ఉమ్మడి కడప జిల్లా నలుమూలల నుండి వచ్చిన పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

పశు వైద్యులు ప్రజలకు అందుబాటులో ఉండాలి

వీరబల్లి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ప్రతిరోజు ప్ర జలకు అందుబాటులో ఉండి పశువులకు వైద్యసేవలు అం దించాలని జిల్లా పశు వైద్యా ధికారి గుణశేఖర్‌పిళ్లై ఉప సంచాలకులు మాలకొండయ్య సూచించారు. శుక్రవారం వంగిమళ్ల, దిగువ రాచపల్లి, వీరబల్లి పశువైద్యశాలలను తనిఖీ చేశారు. ప్రస్తుతం పశువులకు సోకు తున్న వ్యాధులపై ఆరా తీశారు. సిబ్బందికి తగు సలహాలు, సూచనలు ఇచ్చారు. అనంతరం వడ్డెపల్లెలో పందుల పెంపకం షెడ్డును పరిశీలించారు. తుఫాన్ కారణంగా పందులకు ఏమైనా రోగాలు వచ్చాయా అని ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పశువులకు గొంతువాపు టీకాలు వేయించండి

ఒంటిమిట్ట, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : పశువులకు గొంతువాపు టీకాలు వేయిం చాలని పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ శ్రీనివాసులు సూచించారు. శుక్రవారం ఒంటిమిట్ట రాచగుడిపల్లె, మంటపంపల్లెలోని పశువుల ఆసుపత్రిని తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ మండలంలోని పశువులకు గొంతువాపు టీకాలు తప్పక వేయించాలన్నారు. ఏడీ ఉమా మాట్లాడుతూ మండలంలో సిబ్బందితో పాటు మందుల కొరత అంశాన్ని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. చివరిసారిగా 2024 డిసెంబరులో మందులు వచ్చాయని ఫిర్యాదు చేశారు. వర్షాకాలంలో పశువుల గిట్టలకు పుండ్లు ఏర్పడుతాయని, వీటి నివారణకు కూడా మందుల కొరత ఉన్నదన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ స్వాతి, సిబ్బంది సుబ్బలక్షుమ్మ తదితరులు పాల్గొన్నారు.

'అమృత సంభాషణ' విజయవంతం చేద్దాం

కడప ఎర్రముక్కపల్లె, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): వికసిత భారత్-2047 లక్ష్యాన్ని సాధించేందుకు కేంద్ర ప్రభుత్వంచేపట్టిన అమృత సంభాషణ కార్యక్రమం విజయవంతం చేయాలని సీనియర్ డీఈ ఎన్ సుదర్శన్‌రెడ్డి కోరారు. శుక్రవారం కడప రైల్వే స్టేషన్ వీఐపీ లాంజ్‌లో అమృత్ సంవాద్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేగవంతమైన వందే భారత్ రైళ్లు, ఆధునిక స్టేషన్లు, ఎలక్ట్రిఫికేషన్ వంటి సంస్కరణలు భారత రైల్వేను కొత్త శకానికి చేర్చాయని వివరించారు. అమృత సంభాషణ ద్వారా ప్రజల ఆలోచనలు ప్రభుత్వ విధానాల్లో ప్రతిఫలించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఏడీఈఎన్ అశోక్‌కుమార్ స్టేషన్ అభివృద్ధి కమిటీ సభ్యులు నాగిరెడ్డి, కృష్ణారావు, పద్మావతి, శ్రీనివాసులు,ప్రవీణ్‌నాయుడు పాల్గొన్నారు.

రైలు ప్రయాణికులకు వసతులు కల్పించండి

రాజంపేట, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులకు మెరుగైన వసతులు కల్పించాలని గుంతకల్ రైల్వే డీఆర్సీ సభ్యుడు తల్లెం భరత్‌కుమార్‌రెడ్డి కోరారు. శుక్రవారం రైల్వే అధికారులతో కలిసి రాజంపేట రైల్వేస్టేషన్‌లో అభివృద్ధి పనులను పరిశీలించి తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమృత సంవాద్ పథకం కింద రాజంపేట రైల్వేస్టేషన్‌కు 20 కోట్ల రూపాయలు మంజూరు చేసిందన్నారు. ఈ నిధులతో రైల్వేస్టేషన్ ఆధునీకరణ, ఎస్కలేటర్, లిఫ్ట్, కొళాయిల ఏర్పాటు, అధునాతన టికెట్ కౌంటర్ ఏర్పాటు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో రైల్వే సీనియర్ డీన్ సుదర్శన్‌రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ రాజగోపాల్‌రెడ్డి, ఎలక్ట్రికల్ డీఈ శ్రీనివాసులు, వాసుదేవనాయుడు, సనిశెట్టి నవీన్, జనార్దన్‌రెడ్డి, గోపినాధ్ తదితరులు పాల్గొన్నారు.

అనుమతులు లేకుండా క్వారీలు నిర్వహిస్తే చర్యలు

వాల్మీకిపురం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): అనుమతు లు లేకుండా క్వారీలు నిర్వ హిస్తే కఠిన చర్యలు తప్ప వని మైన్స్ ఏజీ.శివప్రసాద్ హెచ్చరించారు. అనధికా రికంగా క్వారీయింగ్ చేస్తు న్నారన్న ఫిర్యాదులు అంద డంతో శుక్రవారం మండలం లోని టి.సాకిరేవుపల్లె వద్ద క్వారీలను పోలీసులు, రెవెన్యూ అధికారులతో కలిసి తనిఖీ చేశారు. గ్రామస్తులను విచారణ చేసి వివరాలు తెలుసుకు న్నారు. అనంతరం మాట్లాడుతూ అనుమతులు లేకుండా క్వారీయింగ్ నేరమని, తమకు అందిన ఫిర్యాదుపై తప్పకుండా చర్యలు తీసుకుం టామన్నారు. కార్యక్రమంలో సీఐ రాఘవరెడ్డి, తహసీల్దార్ పామిలేటి, ఎస్ఐ చంద్రశేఖర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సీడీసీఈబీ కార్యదర్శిగా తాటిపర్తి గంగాధరం

పీలేరు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా ఉమ్మడి పరీక్షల విభాగం(సీడీసీఈబీ) కార్యదర్శిగా వేపులబైలు పంచాయతీ జంగంపల్లె జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం గంగాధరాన్ని నియమిస్తూ జిల్లా విద్యాశాఖాధికారి సుబ్రహ్మణ్యం గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇదివరకు ఆ పోస్టులో నాగమునిరెడ్డి ఉండేవారు. గంగాధరం మాట్లాడుతూ తనపై నమ్మకంతో తనను సీడీసీఈబీ కార్యదర్శిగా నియమించినందుకు జిల్లా విద్యాశాఖాధి కారికి కృతజ్ఞతలు తెలిపారు. పరీక్షల పారదర్శక నిర్వహణకు సంబంధిం చిన విధులు, తన పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఈ సంద ర్భంగా ఆయనను ఎస్‌టీఏ రాష్ట్ర అధ్యక్షుడు కొండూరు శ్రీనివాస రాజు, జిల్లా అధ్యక్షుడు పీవీ రమణ, ప్రధాన కార్యదర్శి దుర్గాప్రసాద్, సభ్యులు విశ్వనాథ్, రమణ, వేణుగోపాల్ రెడ్డి, వైవీ రమణ, తదితరులు అభినం దించారు.


వీరశైవ జంగాలకు ప్రాధాన్యమివ్వాలి

కలికిరి, అక్టోబరు 31 (ఆంధ్ర జ్యోతి): శ్రీశైలం ఆలయంలో వీరశైవ జంగాలకు అన్ని విషయాల్లో ప్రాధాన్యం కల్పించాలని రాష్ట్ర జంగమ సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ అధ్యక్షుడు వాసునూరి చంద్ర శేఖర్ కోరారు. రాజంపేటలో శ్రీశైలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్మన్ పోతుగుంట రమేష్ నాయుడును శుక్రవారం కలిసి అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ప్రధాన శైవాలయమైన శ్రీశైలంలో వీరశైవ జంగాలకు సముచిత స్థానం కల్పించాలని కోరారు. దర్శనాలు, వ్యాపార సముదాయాల నిర్వహణ, జంగం దేవర్ల సత్రాల ఏర్పాటు, ఆలయ అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రాధాన్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఆలయ వాణిజ్య, నిర్వహణా వ్యవహారాల్లో అన్యమతస్తులను దూరంగా ఉంచాలని సూచించారు. అన్ని వర్గాల శైవులు, వీరశైవులు, వాటి శాఖల వారిని చేరదీసి ఆలయ అభివృద్ధిలో పాలుపంచుకునేలా ప్రోత్సహించాలని సూచించారు. వీరశైవ జంగాలకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందజేసేందుకు చైర్మన్ రమేష్ నాయుడు సానుకూలంగా స్పందించి హామీ ఇచ్చినట్లు చంద్రశేఖర్ వివరించారు.

జగనన్న మార్ట్‌కు వసూళ్లు

● 1344 డ్వాక్రా సంఘాల నుంచి రూ.20.16లక్షల సేకరణ ● ఏడాది తర్వాత రూ.6.72లక్షలు తిరిగి చెల్లింపు ● రూ.13లక్షలపై విచారణ కమిటీలు ● తేలని వ్యవహారం

పులివెందులలో జగనన్న మార్ట్ పేరుతో డ్వాక్రా సంఘాలలో ఒక్కొక్క సంఘం నుంచి రూ.1500 చొప్పున రూ.20.16లక్షలు వసూలు చేశారు. మూడేళ్లపాటు ఈ మార్ట్‌లో వ్యాపారాలు సాగించారు. డ్వాక్రా సంఘాలకు ఏడాదిలో ఒక్కొక్క సంఘానికి రూ.500 వెనక్కి తిరిగి చెల్లింపులు సాగినా పూర్తిమొత్తం ఎవరి దగ్గరుందో అంతుబట్టడం లేదు. ఇప్పటికే రెండు కమిటీలు విచారణ చేపట్టినా తేలలేదు.





పులివెందులలో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహిళా మార్ట్ (జగనన్న మార్ట్)

పులివెందుల రూరల్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): పులివెందుల మున్సిపాలిటీ పరిధిలో మెప్మా ఆధ్వర్యంలో దాదాపు 1344 గ్రూపులు ఉన్నాయి. 2021లో ఉన్న ఈ గ్రూపుల్లోని సభ్యులను వ్యాపార భాగస్వామ్యులను చేస్తూ జగనన్న మార్ట్ పేరుతో ఓ సూపర్‌మార్కెట్ ఏర్పాటు చేశారు. అందులో లాభమైనా, నష్టమైనా అందరికీ చెందాల్సిందే. ఇది ఒకరకంగా మహిళలకు ఆర్థిక భరోసాగా నిలిచే కార్యక్రమమైనా కొందరి అవినీతి ఆలోచనలతో భారీ అవకతవకలు చోటుచేసుకున్నాయి. ఈ మార్ట్‌లో ఏర్పాటు చేసిన వస్తువులను నెలనెలా ఈ గ్రూపుల్లోని సభ్యులే కొనుగోలు చేస్తుండేవారు. ధరల్లో వ్యత్యాసాలు ఉన్నాయని అప్పట్లో పలువురు మహిళలు ప్రశ్నించారు. అయితే ఆర్పీలు, మెప్మా సిబ్బంది ఇందులో వచ్చే లాభాలు మీకే వస్తాయి కదా అని వారిని ఏమార్చి వస్తువులను కట్టబెట్టేవారు. ఏడాది అనంతరం 1344గ్రూపులకు ఒక్కో గ్రూపునకు రూ.500 వెనక్కి ఇచ్చేశారు. అంటే దాదాపు రూ.6.72లక్షలు చెల్లించారు. అయితే మిగిలిన రూ.13.44లక్షలు ఏమైపోయాయో ఎవరికీ అంతుబట్టడం లేదు.

కొనుగోళ్లు-విక్రయాలు

పెద్దఎత్తున కొనుగోలు చేస్తే డీలర్ వద్ద ఎమ్మార్పీ కంటే తక్కువగానే ఉంటుంది. అయితే జగనన్న మార్ట్‌లో ఎమ్మార్పీ కంటే దాదాపు రూ.5 నుంచి రూ.10 ఎక్కువగా విక్రయాలు జరిపినట్లు పలువురు డ్వాక్రామహిళలు చెబుతున్నారు. ఈ లెక్కన ఎంత ఆదాయం వస్తుందంటే.. ఉదాహరణకు 100 సన్‌ఫ్లవర్ ఆయిల్ ప్యాకెట్లు డీలర్ వద్ద కొంటే ఒక్కో ప్యాకెట్ ధర రూ.130లు (ఎమ్మార్పీ రూ.150) అనుకుంటే రూ.13000పెట్టుబడి పెట్టినట్లు లెక్క. కానీ జగనన్న మార్ట్‌లో విక్రయించిన ధర రూ.160. అంటే 100 సన్‌ఫ్లవర్ ఆయిల్ ప్యాకెట్లు విక్రయిస్తే రూ.16000 వస్తుంది. ఇందులో ఆదాయం రూ.3000. రవాణా చార్జీలు రూ.200 తీసేసినా రూ.2800 మిగులుతుంది. ఇలాంటి వ్యాపారం దాదాపు మూడేళ్లు సాగింది. కాగా ఇలాంటి నిత్యావసర వస్తువులు ఎన్ని ఉంటాయో అందరికి తెలిసిన విషయమే. వీటన్నిపైనా రూ.5 నుంచి రూ.10 ఎక్కువకు కొనుగోలు చేస్తే ఎంత మొత్తం అవుతుందనేది ఊహకందనిది.

అవినీతి పాత్ర ఆర్పీలదే..

డ్వాక్రా మహిళలు పెట్టుబడి పెట్టే విషయంలో ఆర్పీ పాత్ర ఎక్కువగా ఉందని పలువురు డ్వాక్రామహిళలే బహిరంగంగా చెబుతున్నారు. వ్యాపారంలో భాగస్వామ్యులు కావాలని, మనకు తక్కువకే సరుకులు దొరుకుతాయని నమ్మబలికి ఒక్కొక్కరిచే రూ.150 గ్రూపు అంతా కలిసి రూ.1500 కట్టించు కున్నారు. పులివెందుల మెప్మాలో దాదాపు 44 మంది ఆర్పీలు ఉన్నారు. వీరంతా వారివారి గ్రూపుల వారితో రూ.1500 చొప్పున కట్టించి జగనన్న మార్ట్‌కు చెల్లించారు. ఇలా దాదాపు రూ.20.16లక్షలు జగనన్న మార్ట్ కోసం వసూళ్లు చేశారు. ఇప్పటి వరకు ఒక్కో గ్రూపునకు రూ.500 అంటే రూ.6.72లక్షలు చెల్లించారు. మిగిలిన డబ్బు ఏమైందంటే ఒకరిపై ఒకరు నెపం వేసుకుంటూ మహిళలను మభ్యపెట్టారు. మొత్తానికి మార్ట్ మూతపడేలా చేసేశారు. పెట్టుబడి డబ్బు కూడా పూర్తిగా రాకపోవడంతో మహిళలు లబోదిబో మంటున్నారు. ఈ అవినీతిలో ఆర్పీలే ఎక్కువగా దోచుకున్నారని పలువురు మహిళలు బహిరంగంగానే చెబుతున్నారు. రూ.13.44 లక్షలు ఏమైపోయాయో అంతుపట్టని ప్రశ్నగా మిగిలిందని ఆరోపిస్తున్నారు.

మరో కమిటీని నియమిస్తాం..

జగనన్న మార్ట్‌లో జరిగిన అవినీతిపై మెప్మా పీడీ కిరణ్‌కుమార్‌ను ఆంధ్రజ్యోతి వివరణ కోరింది. ఇందుకు ఆయన స్పందిస్తూ రెండు కమిటీల ద్వారా విచారణ జరగలేదు. మరోమారు కమిటీని నియమించేందుకు సిద్ధమవుతున్నామని, త్వరలో నిజానిజాలు వెలికితీస్తామని ఆయన వివరించారు.

విచారణ శూన్యం

జగనన్న మార్ట్‌లో అవినీతి జరిగిందనే విషయం బయటకు పొక్కింది. దీంతో జగనన్న మార్ట్‌ను మూసేసి విచారణ చేస్తామని మెప్మా జిల్లా స్థాయి అధికారులు ప్రకటించారు. మొదటిసారి వేసిన కమిటీ చేతులెత్తేసింది. రెండోసారి వేసిన కమిటీ కూడా చేతులెత్తేసి ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నారు. రాజకీయ ఒత్తిళ్లతోనే విచారణ ముందుకు సాగడం లేదని తెలుస్తోంది. ఎవరైనా ప్రశ్నిస్తే వారికి రాజకీయ ఒత్తిళ్లు, లేదంటే వచ్చే రుణాన్ని ఆలస్యం చేయడం వంటి ఇబ్బందులకు ఆర్పీలు గురి చేస్తున్నారని చెబుతున్నారు. ఇదిలా ఉండగా కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఫోటో ఏర్పాటు చేసి మహిళా మార్ట్ అని బోర్డు ఏర్పాటు చేశారు. కానీ అందులోని అవినీతిని వెలికి తీయలేకపోవడం స్పష్టమవుతోంది.

తమ పేర్లు చెప్పాడని జూనియర్‌పై సీనియర్ల దాడి

● కౌన్సెలింగ్ ఇచ్చిన పోలీసులు
● ఇంటికి తీసుకెళ్లిన తల్లిదండ్రులు
● ఆలస్యంగా వెలుగులోకి

పులివెందుల రూరల్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): హాస్టల్‌లో బీడీలు, సిగరెట్లు, గుట్కా ప్యాకెట్లు ఉన్నాయి.. ఇవి ఎలా వచ్చాయని స్థానిక ప్రజలు హాస్టల్‌లో ఉంటున్న ఓ విద్యార్థిని అడిగారు. దీంతో ఆ విద్యార్థి వాటిని పీల్చే అలవాటు ఉన్న విద్యార్థుల పేర్లు చెప్పడంతో స్థానికులు హాస్టల్ వార్డన్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో వారి ముందే సదరు విద్యార్థులను వార్డన్ మందలించాడు. దీనిని మనసులో పెట్టుకున్న డిగ్రీ కళాశాల విద్యార్థులు ఇంటర్ విద్యార్థిపై దాడికి దిగారు. ఐదురోజుల క్రితం జరిగిన ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికులు, పోలీసులు, విద్యార్థులు తెలిపిన వివరాల మేరకు... పట్టణంలోని గాయత్రీనగర్ కాలనీలో ప్రభుత్వ బీసీ బాలుర కళాశాల వసతి గృహంలో ఇంటర్, డిగ్రీ చదివే విద్యార్థులు వసతి పొందుతున్నారు. కాగా ఐదురోజుల కిందట ఇంటర్ విద్యార్థిపై డిగ్రీ చదువుతున్న విద్యార్థులు దాడి చేసి గాయపరిచారన్నారు. దాడి చేసినవారు చెడు అలవాట్లు ఉన్న విద్యార్థులే అని తెలిసింది. దాడి అనంతరం గాయపడిన విద్యార్థి తన తల్లిదండ్రులకు చెప్పడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో విద్యార్థులను పిలిపించి పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చి మళ్లీ ఇలాంటివి జరిగితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అనంతరం గాయపడిన విద్యార్థిని తల్లిదండ్రులు ఇంటికి తీసుకెళ్లినట్లు సమాచారం. అయితే దాడి చేసిన విద్యార్థులు హాస్టల్‌కు రాలేదని తెలిసింది. విద్యార్థులు ఇష్టానుసారం ఎప్పుడు పడితే అప్పుడు వస్తుంటారని, ఒక్కోసారి గట్టిగా అరుస్తుంటారని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. వీరిని హాస్టల్ వార్డన్‌పై ఇష్టానుసారం వదిలేశాడని చెబుతున్నారు. దీనిపై హాస్టల్ వార్డన్ మోహన్‌ను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా యవ్వనంలో ఇవన్నీ మామూలేనని, అయినా విద్యార్థికి రక్తం ఏమైనా వచ్చిందా అని ఎదురు ప్రశ్నించారు.

బీసీడబ్ల్యూవో ఏమన్నారంటే...

కళాశాల హాస్టల్‌లో జరిగిన దాడి విషయమై పులివెందుల బీసీడబ్ల్యూవో జ్యోతిని ఆంధ్రజ్యోతి వివరణ కోరగా దాడి విషయం తన దృష్టికి రాలేదన్నారు. ఫిర్యాదు అందితే తప్పకుండా చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు.

విచారణ లేకుండా చర్యలు ఎలా తీసుకుంటారు

● ఇంటర్ ఆర్జేడీ కార్యాలయం ఎదుట సీనియర్ అసిస్టెంట్ నిరసన

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): తనపై వచ్చిన ఆరోపణలపై ఎటువంటి విచారణ చేయకుండా చర్యలు ఎలా తీసుకుంటారని తిరుపతి డీవీఈవో కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ మునిచంద్ర తెలిపారు. శుక్రవారం ఇంటర్మీడియట్ ఆర్జేడీ కార్యాలయం ఎదుట ఆయన నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై డీవీవో పలుమార్లు ఫిర్యాదు చేశారని, అయితే ఎటువంటి విచారణ చేయకుండా డిప్యూటేషన్‌పై బదిలీ చేశారన్నారు. తనకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తానని హెచ్చరించారు. దీనిపై ఆర్జేడీ సురేష్‌బాబును వివరణ కోరగా మునిచంద్రపై వచ్చిన ఆరోపణలపై విచారణ చేసి కమిషనర్‌కు పంపించడం జరిగిందన్నారు. అయితే కమిషనర్ ఆదేశాల మేరకే బదిలీ చేయడం జరిగిందన్నారు.

పంచాయతీలకు స్టాంపు డ్యూటీ ఫీజులు చెల్లించడం లేదు

● మంత్రి పయ్యావులకు కొనిరెడ్డి శివచంద్రారెడ్డి వినతి

ప్రొద్దుటూరు, అక్టోబరు 31(ఆంధ్ర జ్యోతి): జిల్లాలోని పంచాయతీలకు రిజిస్ట్రేషను డిపార్టుమెంటు నుంచి స్టాంపుడ్యూటీ ఫీజులు చెల్లించడం లేదని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌కు సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు శివచంద్రారెడ్డి విన్నవించారు. శుక్రవారం మంత్రి కేశవ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రతి మూడు నెలలకు రావాల్సిన స్టాంపు డ్యూటీ సెప్టెంబరు 2023 నుంచి పంచాయతీలకు చెల్లించలేదని వివరించారు.



మంత్రి పయ్యావుల కేశవ్‌కు వినతి పత్రం అందజేస్తున్న శివచంద్రారెడ్డి

బాలుర ఆట స్థలంలో కిచెన్ షెడ్ నిర్మించవద్దు

● డీఈవో, డ్వామా పీడీ కమిటీకి స్థానికుల అభ్యంతరం

వేంపల్లె, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): మండలానికి మంజూరైన సెంట్రలైజ్డ్ కిచెన్ షెడ్‌ను జిల్లా పరిషత్ బాలుర ఆటస్థలంలో నిర్మించవద్దని పూర్వ విద్యార్థులు, రాజకీయ నాయకులు డీఈవో షంషుద్దీన్, డ్వామా పీడీ విజయకుమార్ బృందానికి అభ్యంతరం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో చుట్టుపక్కల విద్యార్థులకు, పిల్లలకు ఆటస్థలం లేకుండా పోతుందని, కిచెన్ షెడ్ నిర్మాణాన్ని ఇతర ప్రాంతాలకు మార్చాలని విన్నవించారు. శుక్రవారం డీఈవో షంషుద్దీన్, పీడీ విజయ్‌కుమార్, ఎంఈవో స్టాలిన్, పంచాయతీరాజ్ డీఈ సుధాకర్‌రెడ్డి, ఇతర అధికారులు బాలుర ఆటస్థలాన్ని సందర్శించారు. అక్షయపాత్ర ఆధ్వర్యంలో మండలంలోని అన్ని పాఠశాలలకు మధ్యాహ్న భోజనాన్ని అందించే కిచెన్ షెడ్ నిర్మాణం కోసం స్థలాన్ని పరిశీలిస్తుండగా పలువురు ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు, టీడీపీ మండల కన్వీనర్ రామమునిరెడ్డి, దేవస్థాన మాజీ చైర్మన్ జయచంద్రారెడ్డి తదితరులు అధికారులతో మాట్లాడారు. విద్యార్థులకు, స్థానిక ప్రజలకు వ్యాయామానికి ఉపయోగపడుతోందని, కిచెన్ షెడ్ నిర్మాణంతో రాబోవు రోజుల్లో ఇబ్బంది వస్తుందని, తాళ్లపల్లె, లేదా పాములూరు హైస్కూలులో ఏర్పాటుచేస్తే అనువుగా ఉందని వివరించారు. ఇదే విషయాన్ని మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి ద్వారా కలెక్టర్‌కు విన్నవించినట్లు టీడీపీ మండల కన్వీనర్ రామమునిరెడ్డి తెలిపారు. ఈ విషయంపై కలెక్టర్‌తో మాట్లాడి తదుపరి చర్యలు తీసుకుంటామని డీఈవో, పీడీ తెలిపారు.



ఆటస్థలాన్ని పరిశీలిస్తున్న డీఈవో, పీడీ బృందం

హౌస్ బిల్డింగ్ సొసైటీలో అవినీతిపై విచారణ

ప్రొద్దుటూరు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు హౌస్ బిల్డింగ్ సొసైటీలో జరిగిన అవినీతిపై సహకార శాఖ అధికారులు విచారణ చేపట్టారు. ఆమేరకు జిల్లా సహకార శాఖ అధికారులు వైఎంఆర్‌కాలనీలోని హౌస్‌బిల్డింగ్ సొసైటీ కార్యాలయంలో గత నెలలో రికార్డులు తనిఖీ చేశారు. ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ఫిర్యాదు మేరకు సహకార శాఖ అధికారులు విచారణ మొదలు పెట్టారు.హౌస్ బిల్డింగ్ సొసైటీ 1987లో థర్డ్ కాలనీ గా టూటౌన్‌బైపాస్ రోడ్డులో 460 ప్లాట్లు వేసి సొసైటీ సభ్యులకు కేటాయించారు.గతంలో వీటిని కంతుల వంతున సొసైటీనుండి కొనుగోలు చేశారు.వీటని రిజిష్టర్ చేయించుకోలేదు.నేడు ఆ స్థలాలకు భారీగా ధర పలుకుతుండటంతో వాటిని తమ పేరున తమ వారసుల పేరున రిజిష్టర్ చేయించు కుంటున్నారు. ఈ సొసైటీలో సభ్యులుగా వున్న వారికి సొసైటీకి ఎలాంటి డబ్బులు బాకీ లేమని ఎన్‌వోసీ ఇవ్వడానికి హౌస్ బిల్డింగ్ సొసైటీ పెద్దలు అధికారులు కలిసి అవినీతికి పాల్పడుతున్నట్లు ఫిర్యా దులు ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో సొసైటీ సభ్యులు కొందరు నాలుగు ప్లాట్లు ఇటీవల రిజిష్టర్ చేయించుకున్నారు. కానీ ఆ రిజిష్టర్‌చేయించుకుంది హౌస్‌బిల్డింగ్ సొసైటీ చైర్మన్ దార్శల భాస్కర్‌రెడ్డి బినామీలతో చేయించుకున్నట్లు ఫిర్యాదులు అందాయి. ఈ ఫిర్యాదుల మేరకు సహకార శాఖ అధికారి రామక్రిష్ణ విచారించినట్లుసమాచారం. దీనిపై ఇన్‌చార్జ్ కార్యదర్శి విష్ణువర్ధన్ వివరణ కోరగా నాలుగు ప్లాట్లు అక్రమంగా రిజిస్ట్రేషన్లు జరిగాయని ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ఫిర్యాదు చేశారని ఆ ఆమేరకు సెప్టెంబరు నెలలో విచారణ జరిగిందని కానీ ఎటువంటి అక్రమాలు జరగలేదని తెలిపారు.



గండికోట నుంచి 5000 క్యూసెక్కులు విడుదల

కొండాపురం, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): గండికోట ప్రాజెక్టు నుంచి మైలవరం జలాశయానికి శుక్రవారం రాత్రి నుంచి 5000 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఈఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. అదేవిధంగా ప్రాజెక్టులోకి జీఎన్ఎస్ఎస్ కాలువ ద్వారా 4700 క్యూసెక్కులు, చాగల్లు రిజర్వాయిర్ నుంచి పెన్నానది ద్వారా 500 క్యూసెక్కులు, చిత్రావతి నది ద్వారా 200 క్యూసెక్కులు, వరద నీరు మరో 100 క్యూసెక్కులు వచ్చి చేరుతున్నట్లు ఈఈ తెలిపారు. కాగా తాగునీటి అవసరాల దృష్ట్యా మరో 20 క్యూసెక్కుల నీరు వదులుతున్నామన్నారు. గండికోట ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 26.85 టీఎంసీలు కాగా ప్రస్తుతం 26.62 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ తెలిపారు.

పెన్నాలో 70వేల క్యూసెక్కుల వరదనీరు

చెన్నూరు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): చెన్నూరు వద్ద పెన్నానదిలో 70వేల క్యూసెక్కుల వరద నీరు ప్రవహిస్తుంది. నదిలో నీరు ఉధృతంగా ఉండడంతో ఎవరూ నదీ పరివాహక ప్రాంతాల్లోకి వెళ్లవద్దని, కార్తీక స్నానాల కోసం నదిలో దిగవద్దని తహసీల్దారు హెచ్చరించారు. అలాగే పెన్నానది తీరం వెంబడి నిత్యం వీఆర్వోలు, వీఆర్ఏలు కాపలాగా ఉండాలని అన్నారు.

పుష్పగిరి ఆసుపత్రికి యూసీఐఎల్ వితరణ



చెక్కును అందజేస్తున్న యూసీఐఎల్ ప్రతినిధులు

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (యూసీఐఎల్) తమ సీఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా పుష్పగిరి విట్రియో రెటినా ఇన్‌స్టిట్యూట్ (పీవీఆర్ఐ)కు రూ.24.20లక్షలను అందజేసింది. ఈ మేరకు యూసీఐఎల్ జీఎం (మిల్) సుమన్ సర్కార్ శుక్రవారం పుష్పగిరి ఆసుపత్రి హెడ్ సూర్యప్రకాష్‌కు అందజేశారు. ఈ నిధులతో వైద్య పరికరాలు కొనుగోలు చేసి ప్రతి సంవత్సరం 5000 కంటే ఎక్కువ ఉచిత కంటి శస్త్రచికిత్సలు చేయనున్నట్లు పుష్పగిరి సంస్థ తెలిపింది. కార్యక్రమంలో డీజీఎం (పర్చేజ్) ఎస్కే బర్మన్, సీఎస్ఆర్ ఇన్‌చార్జి పాల్గొన్నారు.

దొంగ అరెస్టు

● బంగారు సరుడు, రెండు మోటారు బైకులు స్వాధీనం

పోరుమామిళ్ల, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): పరారీలో ఉన్న ప్రకాశం జిల్లా కొత్తపట్నం మండలం ఈతముక్కల గ్రామానికి చెందిన దర్శనాల ఏడుకొండలును అరెస్టు చేసి అతని నుంచి 35 గ్రాముల బంగారు సరుడు, గ్లామర్ హీరో, పల్సర్ బైకులను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ శ్రీనివాసులు, కలసపాడు ఎస్ఐ తిమోతి తెలిపారు. శుక్రవారం పోరుమామిళ్ల పోలీసుస్టేషన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ సమాచారం మేరకు శుక్రవారం మల్లకతవ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా మోటరు బైకులో గిద్దలూరు వైపు వెళుతున్న ఏడుకొండలును అదుపులోకి తీసుకుని అరెస్టు చేశామన్నారు. బంగారు తాళిబొట్టు సరుడు సుమారు 35 గ్రాములు, రెండు మోటారుబైకులను స్వాధీనం చేసుకున్నామని, నిందితుడిని కోర్టుకు హాజరుపరుస్తున్నట్లు వారు తెలిపారు.

సేవాశ్రమం సేవలు అభినందనీయం

కాశినాయన, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): ఓబుళాపురం సమీపంలోని వివేకానంద సేవాశ్రమంలో అనాథలు, వృద్ధులకు అందిస్తున్న సేవలు అభినందనీయమని జిల్లా వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు కృష్ణకిషోర్ అన్నారు. శుక్రవారం కడప కలెక్టరేట్ ఆవరణంలో ఉన్న వయోవృద్ధుల సంక్షేమ కార్యాలయంలో వివేకానంద సేవాశ్రమం వ్యవస్థాపకుడు రామకృష్ణారెడ్డిని అభినందించారు. దీంతో ఆశ్రమం వాసులు, సంస్థ ఆత్మీయులు హర్షం వ్యక్తం చేశారు.

జాతీయ ఉర్దూ అవార్డు గ్రహీతకు సన్మానం



నాదిర్షావలిని సన్మానిస్తున్న అధికారులు

నిమ్మనపల్లి అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉర్దూ హైస్కూల్ ఉపాధ్యాయుడు నాదిర్షావలికి జాతీయ ఉర్దూ అవార్డు రావడం హర్షించదగ్గ విషయం అని తహసీల్దార్ తపస్విని, ఎంపీడీఓ రమేష్ తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడు తూ ఉరూద క్వామీ ఉర్దూ శిక్షక్ కర్మచారి సంఘ్ నేతృత్వంలో విశేష కృషి చేసినందుకు ఏపీ నుంచి నాదిర్షా వలి ఎంపికైనట్లు తెలిపారు. గత ఆదివారం ఢిల్లీలోని గాలిబ్ అకాడమీలో నిర్వహించిన కార్యక్రమంలో చౌదరి వాసిల్ అలీ గుర్జర్ నుంచి అవార్డుతోపాటు, బంగారు పతకం, ప్రశంశాపత్రం అందుకున్నట్లు తెలిపారు. అనంతరం ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హెచ్ఎం అంజాద్, ఆర్ఐ రాంప్రసాద్, కార్యదర్శి నాగరాజు, మల్లప్ప తోటి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండు, గ్యారేజీలో విజిలెన్స్ తనిఖీలు



రికార్డులు పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

పీలేరు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): పీలేరు ఆర్టీసీ బస్టాండు, గ్యారేజీలో కడప జోన్ విజిలెన్స్ అధికా రులు శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. విజిలెన్స్ సహాయ మేనేజర్ పెద్దిరాజు నేతృత్వంలో బస్టాండులోని సౌకర్యాలు, దుకాణాలు, కార్గో కార్యాలయం, గ్యారేజీలోని బస్సుల టైర్లు, విడి భాగాలు, ఆయిల్ నిల్వల రికార్డులను తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో ఎంఎఫ్ హరినాథరెడ్డి, నరసింహా రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నిత్యపూజకోనకు బస్సు సౌకర్యం ఏర్పాటుకు వినతి

సిద్దవటం, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): లంకమల్ల అభయారణ్యంలో వెలసిన నిత్యపూజేశ్వరకోనకు బస్సు సౌకర్యం ఏర్పాటు చేయాలని ఎండోమెంట్ ఈవో శ్రీధర్ శుక్రవారం కడపలో ఆర్టీసీ రీజనల్ మేనేజర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ ఇన్‌చార్జి ఈవో శ్రీధర్ మాట్లాడుతూ మండలంలోని వంతాటిపల్లె గ్రామం లంకమల్ల అభయారణ్యంలో వెలసిన నిత్యపూజేశ్వరకోనకు ప్రతి సోమవారం, కార్తీక మాసంలో వచ్చే భక్తులకు ఆర్టీసీ బస్సు సౌకర్యం ఏర్పాటు చేయాలని కోరామన్నారు. ప్రతి సోమవారం కడప పాతబస్టాండు నుంచి ఉదయం బయలుదేరుతుందని, అలాగే కార్తీక మాసంలో బస్సు సౌకర్యం ఏర్పాటుకు ఆర్టీసీ అధికారులు అంగీకరించారని తెలిపారు. ఆర్టీసీ అధికారులకు ఆలయ చైర్మన్ జంగిటి రాజేంద్రప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

ఎర్రగుంట్ల, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): స్థానిక ముద్దనూరు రోడ్డు స్వప్నా సందులో నివాసం ఉంటున్న అంకిరెడ్డిపల్లె రామదాసు(38) ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మద్యానికి అలవాటు పడ్డ రామదాసు తరచూ భార్య చంద్రకళతో గొడవ పడేవాడు. వీరికి ఇద్దరు కుమారులున్నారు. తరచూ గొడవపడుతుండడంతో కలత చెందిన భార్య ఇద్దరు కుమారులతో కలిసి గురువారం పుట్టింటికి వెళ్లింది. అదేరోజు రాత్రి ఇంట్లో ఒంటరిగా ఉన్న రామదాసు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. శుక్రవారం ఇంటివద్దకు వెళ్లగా తలుపులు వేసివున్నాయి. ఎంత పిలిపిచినా పలకకపోవడంతో తలుపులు తెరచి చూడగా రామదాసు ఉరి వేసుకుని వేలాడుతున్నాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి విచారిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

గోడ కూలి మహిళ మృతి

సీకేదిన్నె, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): గోడకూలి గాయాలపాలైన కొట్లూరి శివమ్మ (52) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు చింతకొమ్మదిన్నె పోలీసులు తెలిపారు. మండలంలోని కొప్పర్తి పంచాయతీ హరీంద్రనగర్‌కు చెందిన కొట్లూరు శివమ్మ ఉదయం 7 గంటల సమయంలో గోడకు తగిలించిన చొక్కాలో డబ్బులు తీసుకుని వస్తుండగా ప్రమాదవశాత్తు గోడ విరిగి శివమ్మ, ఆమె అత్త నారాయణమ్మపై పడడంతో ఇరువురికీ గాయాలయ్యాయి. స్థానికులు హుటాహుటిన కడప రిమ్స్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శివమ్మ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

జూదరుల అరెస్టు

వల్లూరు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తోళ్లగంగనపల్లె గ్రామ శివారులోని ముళ్లపొదల్లో జూదమాడుతున్నట్లు సమాచారం రావడంతో ఎస్ఐ పెద్ద ఓబన్న దాడులు నిర్వహించారు. ఈ దాడిలో ఆరుగురిని పట్టుకుని వారి వద్ద నుంచి రూ.12600 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. మండల పరిధిలో ఎక్కడైనా చట్టవ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు.

కృషికి తగ్గ ఫలితం

● సింగిల్ విండో చైర్మన్‌గా ప్రమాణం చేసిన జయరామిరెడ్డి
● అభినందించిన టీడీపీ నేతలు


జయరామిరెడ్డిని అభినందిస్తున్న సురేంద్రయాదవ్

కురబలకోట, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): టీడీపీ ఆవిర్భావం నుంచీ క్రియాశీలకంగా పనిచేస్తూ పార్టీ కోసం చేసిన విశేష కృషికి తగిన ఫలితంగా వై.జయరామిరెడ్డికి సింగిల్ విండో చైర్మన్‌గా అవకాశం దక్కిందని వక్తలు అన్నారు. కురబలకోట సింగిల్ విండో కార్యాలయంలో సీఈఓ రాజన్న చైర్మన్, సభ్యులతో ప్రమాణం చేయించారు. బి.కొత్తకోట, ములకలచెరువు, తంబళ్లపల్లె, కురబలకోట మండలాల సింగిల్ విండోకు త్రిసభ్య కమిటీనీ నియమించింది. ఇందులో చైర్మన్‌గా వై.జయరామిరెడ్డి, సభ్యులుగా ముదివేడు, మట్లివారిపల్లె పంచాయతీ వాసులు నాగరాజ, చామంతి రెడ్డెప్ప మెంబర్లుగా ప్రమాణం చేశారు. సింగిల్ విండో చైర్మన్ మాట్లాడుతూ మండల పరిధిలో ప్రతి రైతుకూ అన్ని విధాలా అండగా ఉంటానన్నారు. రైతులకు విరివిగా రుణాలను అందివ్వడం, వ్యవసాయరంగాన్ని అభివృద్ధి చేయడానికి కృషి చేస్తానన్నారు. కమిటీని టీడీపీ నేతలు కార్యకర్తలు అభినందించారు. రాజంపేట పార్లమెంటరీ బీసీ సెల్ అధ్యక్షుడు సురేంద్రయాదవ్ తదితరులు వారిని సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ భూమిరెడ్డి, మాజీ సర్పంచ్ వైజీ రమణ, ఉపసర్పంచ్ బి.భాస్కర్, గుడే శ్రీనివాసులు, రుద్రబాలకృష్ణ, రాజంపేట పార్లమెంటరీ తెలుగు యువత ప్రధానకార్యదర్శి అయూబ్‌భాషా, శంకర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అభినందించిన ఎమ్మెల్యే

మదనపల్లె టౌన్/అర్బన్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): టీడీపీలో ఆధిష్టానం విధేయతకు పట్టం కడుతోందని ఎమ్మెల్యే షాజహాన్‌బాష అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే నివాసంలో ప్రసన్న వేంకటేశ్వరస్వామి, మడికయ్యల శివాలయాల బోర్డు సభ్యులను ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ చైర్మన్ నవీన్‌చౌదరి, సభ్యులు మురళిఉష, నాగమణి, బోర్‌వెల్ నాగరాజు, మడికయ్యల శివాలయం బోర్డు చైర్మన్ కొప్పల వెంకటరమణ, సభ్యులు భవాని, మల్లిక తదితరులు పాల్గొన్నారు. మడికయ్యల శివాలయం కమిటీ అధ్యక్షుడు కొప్పల వెంకటరమణ, సభ్యులు చామంతుల మల్లిక, సిద్ధు, వరప్రసాద్, ప్రకాష్‌నాయుడు, ఎస్ఎల్ నరసింహులు, శివకుమార్ తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరాం చినబాబును కలిసి ధన్యవాదాలు తెలపగా ఆయన అభినందనలు తెలిపారు.

పార్టీలకతీతంగా సమస్యలు పరిష్కరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాష

రామసముద్రం, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): పార్టీలకతీతంగా ప్రజా సమస్యల పరిష్కారానికి నేతలు, కార్యకర్తలు కృషి చేయాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాష అన్నారు. శుక్రవారం మండలానికి విచ్చేసిన ఎమ్మెల్యే ఎరపసెట్టిపల్లె, చెంబకూరులో బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో టీడీపీ నేతలు, కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో మండలంలోని ప్రతి పంచాయతీ సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీలు టీడీపీ కైవశం చేసుకునేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. రామసముద్రం-మదనపల్లె రోడ్డు విస్తరణ చేయాలని నేతలు ఎమ్మెల్యేను కోరగా ఇందుకు సంబంధించి ముఖ్యమంత్రితో చర్చించామని, త్వరలోనే రోడ్డు విస్తరణ పనులు జరుగుతాయని ఎమ్మెల్యే ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు విజయకుమార్‌గౌడ్, మాజీ అధ్యక్షుడు కొండూరు నారాయణరెడ్డి, మాజీ సర్పంచ్ శివప్ప, ప్రశాంత్‌రెడ్డి, శ్రీనాథ్, మాజీ జడ్పీటీసీ శివశంకర్, మునివెంకటస్వామి, కాంట్రాక్టర్ రెడ్డెప్పరెడ్డి, శివారెడ్డి, వేణుగోపాల్, గోపాలకృష్ణ, చెంబకూరు వెంకటేష్, రామ్మూర్తి, టేకుపల్లె రమణ, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

మధ్యాహ్నభోజనం పరిశీలన


విద్యార్థులతో సహపంక్తి భోజనం చేస్తున్న తహసీల్దార్ శ్రీరాములు

పెద్దతిప్పసముద్రం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): టి.సదుం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శుక్రవారం తహసీల్దార్ శ్రీరాములు తనిఖీ చేశారు. పాఠశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పరిశీలించి మెనూ ప్రకారం అందించాలన్నారు. తహసీల్దార్ విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. పాఠశాలలో మౌలిక సదుపాయాలు, పరిసరాల శుభ్రత తనిఖీ చేశారు. బోధనపై టెన్త్ విద్యార్థుల ద్వారా తెలుసుకున్నారు. ఈ ఏడాది టెన్త్‌లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. విద్యార్థుల్లో క్రీడా సామర్థ్యం పెంచాలన్నారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో మెలగాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రజలకు చేదోడుగా కెనరా బ్యాంకు


కలికిరి శాఖను ప్రారంభిస్తున్న జనరల్ మేనేజరు పాండురంగ

కలికిరి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత ప్రజలకు అన్ని రకాల సేవలు అందించడానికే కలికిరిలో కొత్త శాఖను ప్రారంభిస్తున్నట్లు ఆ బ్యాంకు జనరల్ మేనేజర్ ఐ.పాండురంగ మితంతయ్య చెప్పారు. శుక్రవారం కెనరా బ్యాంకు శాఖను ప్రారంభించిన అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులకు, వ్యాపారులకు అనేక రకాల రుణ సౌకర్యం సరళతర మార్గంలో కల్పించనున్నట్లు తెలిపారు. మహిళా సంఘాలకు కూడా అత్యంత ప్రాధాన్యత ఇవ్వనున్నామని చెప్పారు. ప్రధానంగా డిజిటల్ బ్యాంకింగ్ సేవలను అందించడానికి ప్రాధాన్యత ఇస్తామని వివరించారు. కార్యక్రమంలో కడప ఏజీఎం బి. అరుణజ్యోతి, కలికిరి మేనేజర్ రియాజ్ ఉర్ రహ్మాన్, బ్యాంకు సిబ్బంది చంద్రిక, సిద్దం రెడ్డి, భావనా రెడ్డి, పలువురు రైతులు, వ్యాపారులు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటిని సరఫరా చేయాలి : డీఎల్‌డీఓ


పారిశుధ్య కార్యక్రమం తనిఖీలో డీఎల్‌డీఓ

కలకడ, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ట్యాంక్‌ల ద్వారా ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని సరఫరా చేయించాలని డీఎల్‌డీఓ లక్ష్మీపతి సిబ్బందికి సూచించారు. బాటవారిపల్లి పంచాయతీలో శుక్రవారం నిర్వహించిన నీటి నమూనా పరీక్షలను ఆయన పరిశీలించి సూచనలిచ్చారు. గ్రామంలో జరుగుతున్న పారిశుధ్య కార్యక్రమాన్ని తనిఖీ చేసి పనులను ముమ్మరం చేయాలని ఆదేశించారు. అంతకు మునుపు డీఎల్‌డీఓ కలకడలో చెత్తనుంచి సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించి ఇక్కడి నాడెప్ పిట్‌లో కూరగాయలు, ఆకుకూరలను పడించినట్లే అన్ని పంచాయతీలో ఈ పద్ధతిని అమలు జేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ భానుప్రసాద్, సర్పంచ్ నాగరత్న, కార్యదర్శులు నందిని, శైలజ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఏక్తా దివస్

వాడవాడలా పటేల్‌కు ఘన నివాళులు ● విద్యార్థులతో ర్యాలీ, మానవహారం, ఏక్తా ప్రతిజ్ఞ


పీలేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏక్తా ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు - మదనపల్లెలో మహిళా డిగ్రీ కళాశాలలో పటేల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

పీలేరు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు, దేశ మొదటి ఉప ప్రధాని దివంగత సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ 150వ జయంతిని పురస్కరించుకుని మండలంలో శుక్రవారం జాతీయ ఐక్యతా దినోత్సవం చేసుకున్నారు. యూనిటీ మార్చ్, యూనిటీ ప్రతిజ్ఞ చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర్యానంతరం దేశంలోని వేలాది సంస్థానాలను భారతదేశంలో విలీనం చేసిన నాటి కేంద్ర హోం మంత్రి సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ జయంతి రోజున రాష్ట్రీయ ఏక్తా దివస్ చేసుకోవడం ఆనవాయితీ అన్నారు. పటేల్‌ను ఆదర్శంగా తీసుకుని దేశం కోసం పాటుపడాలన్నారు. అనంతరం విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ క్యాడెట్లతో కలిసి ర్యాలీ నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ ఎస్‌జీ డిగ్రీ కళాశాలలోనూ ఏక్తా దివస్ నిర్వహించారు. ప్రిన్సిపాల్ కె.శ్రీనివాసులు రెడ్డి విద్యార్థులకు ఏక్తా దివస్ ప్రాధాన్యతను వివరించారు. అనంతరం విద్యార్థులతో ఏక్తా ప్రతిజ్ఞ చేయించారు. వేర్వేరుగా జరిగిన కార్యక్రమాల్లో డిగ్రీ కళా శాల ఎన్‌సీసీ అధికారి డాక్టర్ వెంకటరమణయ్య, అధ్యాపకులు వెంకటరత్నం, జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ సహదేవ, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

పెద్దమండ్యంలో...


కలిచెర్లలో ర్యాలీ...

పెద్దమండ్యం, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): పటేల్ జయంతి పురస్కరించుకుని మండలంలో శుక్రవారం జాతీయ ఐక్యతా దినోత్సవం చేసుకున్నారు. పెద్దమండ్యం, కలిచెర్ల గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు ఆయా గ్రామాల్లో, పురవీధుల్లో విద్యార్థులు ర్యాలీలు చేపట్టారు. కలిచెర్ల బస్‌స్టాఫ్ కూడలి వరకు జూనియర్ కాలేజీ విద్యార్థులు, అధ్యాపకులు ర్యాలీ నిర్వహించి ఐక్యతాభావం చాటారు. అనంతరం జరిగిన సమావేశంలో సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ చేసిన సేవలను కొనియాడారు. కలిచెర్ల కాలేజి ప్రిన్సిపాల్ అమరేంద్రకుమార్, ఎన్ఎస్ఎస్ పీఓ వెంకటనరసయ్య, అధ్యాపకులు రవీంద్ర, ముస్తఫా, అనిత, దీవీద్,వినాయకరెడ్డి, ఆలియా పాల్గొన్నారు.

పట్టణంలో వేడుకగా...

మదనపల్లె టౌన్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): ఉక్కుమనిషి సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ జయంతి సందర్భంగా మదనపల్లెలోని పలు కళాశాలల్లో ఘనంగా జాతీయ ఐక్యతా దినోత్సవం నిర్వహించారు. ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులతో డైరెక్టర్ రామలింగారెడ్డి మాట్లాడుతూ భారత ప్రభుత్వ ఆత్మనిర్భర్ భారత్, స్వదేశీ ఉత్పత్తుల వినియోగంతో ఐక్యత సాధించే దిశగా చర్యలు తీసుకుంటోందన్నారు. ప్రిన్సిపాల్ రాయుడు, హెచ్‌ఓడీలు పాల్గొన్నారు. శ్రీ జ్ఞానాంబిక డిగ్రీ కళాశాలలో పటేల్ జయంతి నిర్వహించారు. దేశం కోసం ఆయన చేసిన పోరాటాల గురించి వివరించారు. కరెస్పాండెంట్ ఆర్.గురుప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ రాఘవేంద్ర, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ రమ్య, విద్యార్థులు పాల్గొన్నారు. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ కృష్ణవేణి ఆధ్వర్యంలో ఏక్తా దివస్ నిర్వహించారు. బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ శ్రీదేవి ఆధ్వర్యంలో విద్యార్థులతో పట్టణంలో ఏక్తా దివస్ ర్యాలీ చేపట్టారు. అధ్యాపకులు శైలజ, లీల, మోహనవల్లి, ఖాజావలి, వనజ, సుబ్బరాయుడు, వెంకటశివ తదితరులు పాల్గొన్నారు.

పటేల్ సేవలు చిరస్మరణీయం


ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

కురబలకోట, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ సేవలు చిరస్మరణీయమని ప్రిన్సిపాల్ రామనాథమ్ పేర్కొన్నారు. అంగళ్ళు సమీపంలోని డీమ్డ్ టు బీ మిట్స్ యూనివర్శిటీలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో రాష్ట్రీయ ఏక్తా దివస్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పటేల్ బ్రిటీష్ వారి కుట్రలను విఫలం చేయడంతో పాటుగా అఖండ్ భారత్ నిర్మాణానికి ఎంతో కృషి చేశారన్నారు. యువత పటేల్‌ను ఆదర్శంగా తీసుకుని దేశభక్తిని పెంపొందించుకోవాలన్నారు. విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్, డిబేట్ తదితర పోటీలను నిర్వహించి బహుమతులు, ప్రశంశాపత్రాలను అందజేశారు. ఎన్ఎస్ఎస్ అధికారి రాజేష్ పాల్గొన్నారు.

దేశ ఐక్యతకు కృషి చేసిన ధీశాలి...


తంబళ్లపల్లెలో విద్యార్థుల నివాళులు

తంబళ్లపల్లె, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): దేశ ఐక్యతకు కృషి చేసిన ధీశాలి సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ అని హెచ్‌ఎం రెడ్డప్పరెడ్డి అన్నారు. తంబళ్లపల్లె ప్రాథమిక పాఠశాలలో పటేల్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఉక్కుమనిషి జీవిత చరిత్ర, ఆయన చూపిన ధైర్యం వివరించారు. ఉపాధ్యాయులు రాధిక, సుగుణ తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యపు నీడలో పాలకేంద్రం

దుర్గంధం నడుమ పాలశీతలీకరణ కేంద్రం ● కొరవడిన అధికారుల పర్యవేక్షణ ● మండల సమాఖ్య నిర్వహణా లోపం


పిచ్చిమొక్కల నడుమ పాల శీతలీకరణ కేంద్రం

వాల్మీకిపురం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): వేకువనే ఇంటికి వచ్చి మొట్టమొదటగా పలకరించే పాలవాడే అపరిశుభ్రంగా ఉంటే ఎన్నో నీతి బోధలు చేస్తాం. వినకుంటే పాలవాడినే మారుస్తాం. కారణం పొద్దున్నే టీ, కాఫీ తాగనిదే చాలామంది పనులు మొదలు పెట్టలేరు. అంతేకాకుండా పిల్లలకు బలవర్ధకమైన ఆహారం అంటూ వారితో బలవంతంగా తాగిస్తాం. పాలకు తీసుకునే శ్రద్ధ మన ఆరోగ్యాన్ని కాపాడుతుందని చెబుతుంటాం. అయితే ఎంతో శుభ్రంగా, నాణ్యతగా ప్రజలకు అందించాల్సిన పాలను శీతలీకరించే కేంద్రం అపరిశుభ్రంగా, పిచ్చిమొక్కల పొదల నడుమ, శిథిలావస్థ భవనంలో ఉందంటే నిర్వహణా లోపమనే చెప్పవచ్చు. వివరాల్లోకెళితే...

పట్టణంలో మండల సమాఖ్య ఆధ్వర్యంలో వెలుగు అధికారుల పర్యవేక్షణలో పాలశీతలీకరణ కేంద్రం నిర్వహిస్తున్నారు. ఈ భవనాల చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగి, చెత్తాచెదారం పేరుకుపోయి పరిసరాలు అస్తవ్యస్థంగా తయారయ్యాయి. పురాతన భవనం కావడం శిథిలాలుగా తలపిస్తోంది. శుభ్రత కొరవడడంతో పాల కేంద్రం పరిసరాలు రోత పుట్టిస్తున్నాయి. లోపలి భాగం పైకప్పు పెచ్చులూడి ప్రమాదకరంగా మారింది. పాలకేంద్రం లోపలి భాగంలో అనువుగా లేకపోవడంతో పనిచేస్తున్న సిబ్బందికి సైతం తిప్పలు తప్పడం లేదు. నిర్వహణ విషయంలో బాధ్యత వహించాల్సిన మండల సమాఖ్య అధికారులు అంటీ అంటనట్టు వ్యవహరిస్తుండడం గమనార్హం. నిత్యం అధికారులు తిరుగాడే ప్రాంతమైనా పాలకేంద్రం పట్ల వెలుగు అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే అపవాదు ఉంది. మహిళా సమాఖ్య కార్యాలయం ముందు బురదగుంటను తలపిస్తున్నా అధికారులు, సిబ్బంది అలాగే కాలం వెల్లదీస్తున్నారు. వెలుగు ఏపీఎం నరోత్తమరెడ్డిని వివరణ కోరగా సంబంధిత పాలకేంద్రం నిర్వహణ సిబ్బందితో చర్చించి చర్యలు తీసుకుంటామన్నారు.


అనువుగా లేని పాల కేంద్రం లోపలి భాగం - బురదకుంటను తలపిస్తున్న వెలుగు కార్యాలయ ప్రాంతం (అంతర్ చిత్రంలో) పెచ్చులూడుతున్న పైకప్పు

అనుమతులు లేని లేఅవుట్లను గుర్తించండి


పంచాయతీ కార్యదర్శులకు సూచనలిస్తున్న ఎంపీడీఓ తాజ్‌మస్రూర్

మదనపల్లె టౌన్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రభుత్వ అనుమతులు లేని లే అవుట్లను గుర్తించి నివేదికలు ఇవ్వాలని ఎంపీడీఓ తాజ్‌మస్రూర్, పీకేఎం ఉడా అధికారి సుదర్శన్ పేర్కొన్నారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడుతూ కొత్త చట్టం ప్రకారం లేఔట్‌కు ఈడీసీ చార్జీలు చెల్లించాలన్నారు. దీంతో పాటు బెటర్‌మెంట్ చార్జీలు, పంచాయతీలకు ప్రజాప్రయోజనాల కోసం 10శాతం స్థలాలు కేటాయించాలన్నారు. ఈ నిబంధనలు పాటించని లేఅవుట్లను గుర్తించి నివేదిక ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పాఠశాలల మరమ్మతులు చేయించండి


పాఠశాల భవనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ రమేష్, ఏఈ నాగభూషణం

నిమ్మనపల్లి అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలకు ఉరుస్తున్న పాఠశాలల్లో మరమ్మతులు చేయించాలని ఎంపీడీఓ రమేష్ పేర్కొన్నారు. వర్షాలకు ఉరుస్తున్న కొండయ్యగారిపల్లి పంచాయతీ కొమ్మిరెడ్డిగారిపల్లిలో మోడల్ ప్రైమరీ హైస్కూల్‌ను శుక్రవారం పరిశీలించారు. హెచ్‌ఎం శ్రీదేవి మాట్లాడుతూ చిన్నపాటి వర్షం వస్తే పై కప్పు సక్రమంగా లేక పాఠశాల మొత్తం తడిసిపోతోందన్నారు. దీంతో అక్కడే వున్న సమగ్ర శిక్షా అభియాన్ ఏఈ నాగభూషణంతో మాట్లాడుతూ పాఠశాల మరమ్మతులకు ఎస్టిమేషన్ వేసి మరమ్మతులు చేయించాలన్నారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లను మంజూరు చేయించండి

గుర్రంకొండ, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): వర్షాలకు ఇళ్లు తడుస్తున్నాయని అర్హులైన తమకు ప్రభుత్వ ఇళ్లు మంజూరయ్యేలా చూడాలని దళితులు తహసీల్దార్ లక్ష్మీప్రసన్నను కోరారు. సరిమడుగు పంచాయతీ పరిధిలోని దళితవాడలో శుక్రవారం నిర్వహించిన సివిల్ రైట్స్ డేలో ప్రజలు పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. వర్షాలు వస్తే ఇళ్లు తడుస్తున్నట్లు అధికారులకు తెలిపారు. భూముల సమస్యలను పరిష్కరించాలని కొందరు దళితులు కోరారు. కార్యక్రమంలో ఆర్ఐ సదాశివప్ప నాయుడు, ఏఎస్ఐ బుజ్జినాయక్, ప్రజలు పాల్గొన్నారు.

ఘనంగా ఇందిరమ్మ వర్ధంతి

మదనపల్లె అర్బన్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): తరాలు మారిన భారతదేశానికి ఇందిరమ్మ చేసిన సేవలను మరువలేమని కాంగ్రెస్ నియోజకవర్గ నేత షేక్ రెడ్డి సాహెబ్ అన్నారు. శుక్రవారం బెంగళూరు బస్‌స్టాండ్‌లో ఇందిరమ్మ వర్ధంతి చేశారు. ఈసందర్భంగా ఇందిరమ్మ విగ్రహానికి నివాళులర్పించారు. నాయకురాలు మీనాకుమారి, రాష్ట్ర మైనార్టీ ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్‌కేబాషా, నేతలు ముబారక్ ఖాన్, సోముశేఖర్, శరత్ కుమార్‌రెడ్డి, రవీంద్ర, ఈశ్వరమ్మ, మహమ్మద్ అలీ, మహబూబ్‌పీర్, నాగరాజ, ఖాసీం, సయ్యద్, పవన్, జీవన్, తదితరులు పాల్గొన్నారు.

వార్డులో అభివృద్ధి పనులు

మదనపల్లె అర్బన్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): 31వ వార్డులో రూ.35లక్షలతో సిమెంట్ రోడ్లు, మురుగునీటి కాల్వల నిర్మాణపనులు శుక్రవారం ప్రారంభించారు. వార్డులో జరుగుతున్న పనులను వార్డు ఇన్‌చార్జ్ తమ్మిశెట్టి రామకృష్ణ పర్యవేక్షించారు. పనులు త్వరిగా పూర్తి చేస్తామన్నారు.

కోర్టులో గంగమ్మకు ప్రత్యేక పూజలు

మదనపల్లె అర్బన్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): కోర్టులో గంగమ్మకు శుక్రవారం ఆలయకమిటీ సభ్యులు విశేషంగా పూజలు నిర్వహించారు. రాహుకాల సమయంలో మహిళలు చీర, జాకెట్లు, పసుపు, కుంకుమ, పొంగళ్ల నైవేద్యంగా సమర్పించారు. కార్యక్రమాలను ఆలయకమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

పూజల నిర్వహణపై వివాదం


ఆలయ పూజల విషయంపై ఇరువర్గాలతో మాట్లాడుతున్న ఎస్ఐ

రామసముద్రం, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): చిట్టెంవారిపల్లె గ్రామంలో రెండు వర్గాల మధ్య రామాలయ పూజల నిర్వహణ విషయమై అభిప్రాయ భేదాలు తలెత్తాయి. ఇరువర్గాల వారు వేర్వేరు పూజారులతో తామే ముందు పూజలు చేయాలని పట్టుపట్టడంతో వివాదం నెలకొంది. విషయం తెలుసుకున్న ఎస్ఐ రమేష్‌బాబు గ్రామానికి వెళ్లి రెవెన్యూ అధికారులు, గ్రామ పెద్దల సమక్షంలో ఇరువర్గాలతో చర్చలు జరిపి ఇరువురి మధ్య సయోధ్య కల్పించారు. అనంతరం ఇద్దరికీ ఒకేసారి పూజ చేసేలా నిర్ణయం తీసుకుని భవిష్యత్తులో శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా చూడాలని సూచించారు.

ప్రతి ఉద్యోగికీ విరమణ తప్పదు


పద్మజ దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

పెద్దమండ్యం, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): ప్రతి ఉద్యోగికీ విరమణ తప్పదని యల్లంవారిపల్లి హెచ్‌ఎం విశ్వనాధ్ పేర్కొన్నారు. శుక్రవారం యల్లంవారిపల్లి హైస్కూల్ ఉపాధ్యాయురాలు పద్మజ ఉద్యోగ విరమణ కార్యక్రమం జరిగింది. పద్మజ, నాగభూషణరావు దంపతులను తోటి ఉపాధ్యాయలు సన్మానించారు. ఆమె చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యాయులు, ప్రజలు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఘనంగా కుంకుమార్చన

పెద్దతిప్పసముద్రం, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): ప్రసన్న పార్వతి సమేత విరూపాక్షేశ్వర స్వామి ఆలయం శుక్రవారం శివనామస్మరణతో మార్మోగింది. ఆలయం భక్తులతో కిటకిటలాడింది. కార్తీక మాసం పురస్కరించుకుని శుక్రవారం అమ్మవారికి లలితాహోమం, సర్వమంగళ పూజలు, కుంకుమార్చన పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వహకులు భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. అన్నదానం జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అమరవీరుల త్యాగాలు మరువలేనివి

మదనపల్లె అర్బన్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ప్రాణాలను సైతం పణంగా పెట్టిన అమరవీరుల త్యాగాలు మరువలేనివని మదనపల్లె డీఎస్పీ మహేంద్ర అన్నారు. శుక్రవారం సాయంత్రం పోలీసుల అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా మిషన్ కాంపౌండ్ నుంచి బెంగళూరు బస్టాండ్ వరకు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారం నిర్వహించి విధి నిర్వహణలో అమరులైన పోలీస్ అమరవీరులకు నివాళులర్పించారు. ర్యాలీలో మదనపల్లె సబ్ డివిజన్ సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది, మహిళా పోలీసులు, స్వచ్ఛంధ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించండి


విద్యా సామర్థ్యాలను పరిశీలిస్తున్న న్యాయాధికారి ఉమర్ ఫరూక్

తంబళ్లపల్లె, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన బోధన చెయ్యాలని తంబళ్లపల్లె సివిల్ కోర్టు న్యాయాధికారి ఉమర్‌ఫరూక్ అన్నారు. శుక్రవారం న్యాయాధికారి మండల కేంద్రంలోని ఎస్టీ బాలుర గురుకుల పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, భోజనాలు, వసతులను పరిశీలించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను పరిశీలించారు. పాఠశాలలో పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని, విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. ఆయన వెంట కోర్టు సిబ్బంది, ఉపాధ్యాయులు ఉన్నారు.

సీఎంను కలిసిన రాష్ట్ర టీడీపీ నేతలు


సీఎం చంద్రబాబుతో మనోహర్‌నాయక్

పెద్దమండ్యం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర టీడీపీ ఎస్టీ సెల్ కార్యదర్శి మనోహర్‌నాయక్ అమరావతి సీఎం క్యాంప్ కార్యాలయంలో సీఎం చంద్రబాబును కలిశారు. నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జ్‌ను నియమించాలని కోరారు. గతంలో ఇక్కడ ఇచ్చిన మైనింగ్ అనుమతులు రద్దు చేయాలని ఆయనను కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ గిరిజన నేతలు, తదితరులు ఉన్నారు.